
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 25 అక్టోబరు 2025



పింఛా ప్రాజెక్టు ప్రధాన గేట్ల ద్వారా నదిలోకి విడుదల చేసిన నీరు



ఝురికోన ప్రాజెక్టు

నిర్లక్ష్యపు ఝురి..!

అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది ఝురికోన ప్రాజెక్టు పరిస్థితి. ప్రాజెక్టు నిండా నీరున్నా.. కాలువలు నిర్మాణానికి నోచుకోకపోవడంతో ఆయకట్టు రైతులకు ఉపయోగపడడం లేదు. ఈ పనులు పూర్తి చేస్తామని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు ఇస్తున్న హామీలు నీటిపై రాతలయ్యాయి. జలాశయం తూము మరమ్మతులకు గురై ఏడేళ్లయినా పనులు జరగడం లేదంటే అధికారులకు ఎంత నిర్లక్ష్యమో ఇట్టే అర్థమవుతోంది. ఒక విధంగా రాజంపేటలో వైసీపీ గెలుపే శాపమా? అని పలువురు చర్చించుకుంటున్నారు. పనులు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 10వేల ఎకరాలకు నీరందుతుందని, ఇప్పటికైనా శ్రద్ధ చూపాలని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

- సమస్యల నడుమ ఝురికోన ప్రాజెక్టు
- దశాబ్దం దాటినా కాలువల్లేవు
- రాజంపేటకు వైసీపీ గెలుపే శాపమా ?

సుండుపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతాన్ని సుభిక్షంగా చేయాలన్న సంకల్పంతో 2006లో అప్పటి ప్రభుత్వం సంబేపల్లె, సుండుపల్లె మండలాల సరిహద్దు ప్రాంతంలో ఝురికోన ప్రాజెక్టును రూ.35 లక్షల వ్యయంతో ప్రారంభించింది. జలాశయ నిర్మాణం అయితే పూర్తయింది కానీ నాటి నుంచి కాలువలు నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు దిగువ భాగంలోని సుండుపల్లె మండలానికి చెందిన రైతుల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ప్రాజెక్టులో నీరున్నా నిరుపయోగంగా మారింది. కాలువల నిర్మాణానికి నోచుకోక మండలానికి చెందిన రైతులు గత 16 ఏళ్లుగా సాగునీటి కష్టాలు పడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పాలనలో జలాశయం నుంచి కంభంవారిపల్లె, కలికిరి తదితర మండలాలకు తాగునీటి పథకం మంజూరుచేసి పూర్తి చేశారు. సుండుపల్లె రైతాంగం కోసం బాహుదానదిలో కాలువలు ఏర్పాటు చేయని కారణంగా ఈ ప్రాంతీయులకు ప్రాజెక్టు వలన ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది.

నాడు.. నేడు వైసీపీ శాపం

2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేటలో వైసీపీ గెలవడం.. రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఒక శాపమని రైతులు భావిస్తున్నారు. 151 సీట్లతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా రాజంపేటలో ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిచినా ప్రజాప్రతినిధులు ఝురికోన ప్రాజెక్టుపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. ఝురికోన ప్రాజెక్టు దిగువన కాలువలు ఏర్పాటు చేస్తే సుండుపల్లె మండలానికి చెందిన రైతుల సాగుభూమికి అధికారికంగా 5 వేల ఎకరాలకు, అనధికారికంగా 5వేల ఎకరాల సాగుభూమికి నీటిని అందించవచ్చు అనే విషయాన్ని మరిచిపోయారు. రైతు సంఘాలు ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఝురికోన ప్రాజెక్టు నుంచి కాలువలు ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు ఇచ్చినా, నిరసనలు తెలిపినా పట్టించుకోలేదు. నేడు రాజంపేటతో పాటు సుండుపల్లె రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు స్థానికంగా గెలిచిన వైసీపీ ఎమ్మెల్యే శాసనసభకు వెళ్లనందున సమస్య తీరడం లేదు. పైగా మండలంలో వేలాది మంది రైతులకు సాగునీటిని, ప్రజలకు తాగునీటిని అందించే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే సరైన నాయకుడు లేకపోవడం కూడా ప్రధాన సమస్యగా మారిందని రైతులు, ప్రజలు విమర్శిస్తున్నారు.

వందకోట్లతో ప్రతిపాదనలు

జలాశయం నుంచి గ్రావిటీ పద్ధతిలో రెండు కాలువలు తవ్వి మండలంలోని పలు కుంటలు, చెరువులు అనుసంధానం చేసి నీరందించాలనే లక్ష్యంతో సుమారు రూ.100 కోట్ల అంచనాతో పలుసార్లు జలవనరులశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ కాలువలు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల ఎకరాలకు నీరందించవచ్చు.

ఇదీ.. అసలు విషయం

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నీరు పారేందుకు అప్పట్లో అలుగు ఏర్పాటు చేసినా.. నదీ పరివాహక దిగువ ప్రాంతాల ప్రయోజనాల కోసం నీటిని వదిలేందుకు తూము ఏర్పాటు చేయాలని సాధన సమితి నాయకులు పోరాటం చేయటంతో అప్పట్లోనే తూము ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొన్నాళ్లకే అది దెబ్బతినడంతో 2017లో తాత్కాలికంగా కాంక్రీట్ వేసి మరమ్మతులు చేయడంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తూము పునరుద్ధరణ పనులకు రూ.55 లక్షలతో జలవనరులశాఖ అధికారులు నివేదికలు సమర్పించారు. సకాలంలో అనుమతులు ఇవ్వనందున నిధులు మంజూరు చేయలేదు. అనంతరం సార్వత్రిక ఎన్నికలు కావడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి.

త్వరలో టెండర్లు..



రూ.54 కోట్లతో త్వరలో టెండర్లు పిలుస్తాము. అందుకు తగిన నివేదికను సిద్ధం చేస్తున్నాము. త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాము. తూము మరమ్మతులు చేయడంతో పాటు కాలువలు ఏర్పాటు చేస్తాము.

- వెంకట్రామయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జలవనరుల శాఖ, కడప



ప్రాజెక్టు మొరవ



కాలువలు లేక బాహుదాలో వృథాగా పోతున్న నీరు

పింఛా ప్రాజెక్టులోకి వరద నీరు

- దిగువకు 6,344 క్యూసెక్కుల నీరు విడుదల
- రాకపోకలకు అంతరాయం

సుండుపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా చేరుతోంది. దాదాపు వారం నుంచి కురుస్తున్న వర్షాలతో పింఛా నిండుకుండలా మారింది. ప్రాజెక్టు ప్రధాన గేట్లతో పాటు కుడి, ఎడమ కాలువల్లోకి ప్రాజెక్టు అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం పై ప్రాంతాల నుంచి 6,253 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో, 6,344 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఉదయం నుంచి ప్రాజెక్టు మూడు గేట్ల ద్వారా నిరంతరాయంగా నీరు నదిలోకి విడుదల చేయడంతో చిన్నబిడికి దిగువున కాజ్వే, రాయవరం దిగువ భాగంలో బాహుదానది పైన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 20 పల్లెల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ముడుంపాడు కాజ్‌వేపై నుంచి ఆరోగ్యపురం బస్సును అధికారులు నడుతున్నారు. ప్రాజెక్టు పైప్రాంతాల నుంచి వచ్చే నీటి ఉధృతిని బట్టి నదిలోకి నీటిని విడుదల చేస్తామని ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ తెలిపారు. ఇప్పటికే నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేశామన్నారు.



చిన్నబిడికి దిగువ భాగంలో కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న పింఛా నది

ఆర్టీసీలో పదోన్నతుల జాతర

- ఉద్యోగుల్లో హర్షం

కడప మారుతీనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): లక్షలాది మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసే సంస్థగా ఖ్యాతిగాంచిన ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులకు పదోన్నతులు లేవు. నాటి వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసిందే కానీ అందులో పనిచేసే ఉద్యోగులను పట్టించుకోలేదు. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. వారి సేవలను పరిగణనలోకి తీసుకున్న కూటమి సర్కారు దీపావళి రోజున అందులో పనిచేసే ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేలా జీవో ఎంఎస్ నెం.44ను తీసుకువచ్చింది. ఆరు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు పదోన్నతులతో పాటు డీఏ కూడా ప్రకటించడంతో వారు మరింత ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆ మేరకు ఉమ్మడి కడప జిల్లాలో దాదాపు 470 మంది పదోన్నతులు పొందనున్నారు. కండక్టర్లు, డ్రైవర్లలో కంట్రోలర్‌లు, ఏడీసీలుగా దాదాపు 100 మందికి పదోన్నతి లభించనుంది. అలాగే కంట్రోలర్ - ఏడీసీ నుంచి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లుగా 35 మందికి, మెకానిక్స్, ట్రిమ్మర్, వెల్డర్, పెయింటర్స్, కోచ్ బిల్డర్లు తదితర కేటగిరీలలో సీనియారిటీ ప్రాతిపదికన 17 మందికి (ఎల్‌హెచ్) లీడింగ్ హ్యాండ్ ప్రమోషన్లు ఇవ్వనున్నారు. మరో 29 మంది అసిస్టెంటు మెకానిక్స్ నుంచి డిప్యూటీ మెకానిక్స్‌గా పదోన్నతి అందుకోనున్నారు. ఇదే కాక గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 ప్రమోషన్లు ఇవ్వడానికి జాబితా తయారు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో డ్రైవర్లు 155మందికి, కండక్టర్లు 119 మందికి, మెకానిక్స్‌కు 24 మందికి, ఆర్టిజాన్స్ కేడరులో మరో 12 మందికి గ్రేడ్-1 ప్రమోషన్లు రానున్నట్లు సమాచారం. మొత్తంగా కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడేలా చేసింది.

సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 29న రాయచోటి పర్యటన సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. పేదలందరికీ ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమం సందర్భంగా సీఎం రానుండటంతో శుక్రవారం రాయచోటి దిగువ అబ్బవరంలో ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో కలసి చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్, ప్రజావేదిక, లబ్ధిదారుల గృహప్రవేశానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రవి, మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, రాయచోటి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్

వాల్మీకిపురంలో ఉదయం 6గంటలకు మంచుతో మాయమైన వీరభద్రాద్రి కొండ



మంచు మాయ..

వాల్మీకిపురం పట్టణానికి అత్యంత సమీపంలో ఉండే వీరభద్రాద్రి (వీరన్నకొండ)ని మంచు మింగేసిందా అనిపించింది. శుక్రవారం ఉదయం 6.30గంటల ప్రాంతంలో పూర్తిగా మంచు కమ్ముకోవడంతో కొండ కనిపించలేదు. పాదచారులు, సమీప ఇళ్లల్లోని వారు ఈ దృశ్యాన్ని చూసి తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు పోటీ పడ్డారు. 9.30గంటల తర్వాత మంచు వీడటంతో వీరన్నకొండ సుందరంగా దర్శనమిచ్చింది.

- వాల్మీకిపురం



ఉదయం 9.30గంటల తర్వాత కనిపించిన కొండ

భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

రైల్వేకోడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు రైల్వేకోడూరు నుంచి ఇటు రాజంపేట, అటు తిరుపతి ప్రధానరహదారి బాగా దెబ్బతినింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టింది. అయితే వరుసగా ఐదురోజులపాటు కురిసిన వర్షాల కారణంగా మళ్లీ రోడ్డు దెబ్బతినింది. తిరుపతికి రైల్వేకోడూరు నుంచి కారు అయితే ఒక గంటలో వెళ్లిపోవచ్చు. రోడ్డు దెబ్బతినడంతో రెండు గంటల సమయం పడుతోంది. తిరుపతి వైపు ఉన్న మైసూరివారిపల్లె, మాధవరంపోడు, ఉప్పరపల్లె, లక్ష్మీగారిపల్లె, కుక్కలదొడ్డి, బాలపల్లె వరకు రోడ్డు దెబ్బతినింది. అలాగే రైల్వేకోడూరు నుంచి రాజంపేట మార్గంలో ఉన్న రాఘవరాజపురం, అనంతరాజుపేట, మంగంపేట, కొర్లకుంట క్రాస్ రోడ్డు, చిన్నఓరంపాడు, ముక్కావారిపల్లె, పుల్లంపేట, రెడ్డిపల్లె, ఊటుకూరు రాజంపేట వరకు ప్రధానదారి దెబ్బతినింది.

ఆగిన వర్షం.. ఊపిరి పీల్చుకున్న జనం

రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఐదురోజులుగా కురిసిన వర్షం శుక్రవారం తెరిపి ఇవ్వడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కురిసిన భారీ వర్షాల కారణంగా రెడ్డివారిపల్లె-రైల్వేకోడూరు తాత్కాలిక రోడ్డు, పొట్టిరాజుగారిపల్లె-గంగురాజుపోడు తాత్కాలిక రోడ్డు కొట్టుకునిపోయిన విషయం తెలిసిందే. ఇప్పటికీ ఆ దారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు తగ్గగానే తాత్కాలిక రోడ్లు వేస్తామని అధికారులు తెలిపారు. గుంజన, తిరుపతి ఏరు, మేకలగుంతేరు, గుండాలేరు, పుల్లంగేరుల్లో వరదనీరు ప్రవహిస్తోంది.

మాధవరంపోడు వద్ద దెబ్బతిన్న రోడ్డు



పేరు గొప్ప.. ఊరు దిబ్బ

- పారిశుధ్యలోపం.. ప్రజల పాలిట శాపం
- ఏ ప్రాంతంలో తిరగాలన్నా ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే
- ఇదీ రాజంపేట దుస్థితి

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నచందంగా రాజంపేట పరిస్థితి తయారైంది. పట్టణమంతా ఎక్కడ చూసినా మురికికూపంలా ఉంది. నిత్యం ప్రజలు సంచరించే కూరగాయల మార్కెట్‌లో కూడా దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో పట్టణంలో చెత్తను తీసుకెళ్లడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి 13 బ్యాటరీ ఆటోలను ఏర్పాటు చేసినా అవి మూలనపడిపోయాయి. అవి మున్సిపాలిటీ పరిపాలన భవనం ఎదుటే పాడై తుప్పు పట్టినా పట్టించుకునేవారు లేరు. పట్టణంలో ఏ వార్డు చూసినా దుర్వాసన వెదజల్లుతూ ఉంది.



రాజంపేట పరిపాలన భవనం ఎదుట మూలనపడి ఉన్న పారిశుధ్య బ్యాటరీ వాహనాలు

రాజంపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాజంపేట పట్టణానికి మంచి గుర్తింపు ఉంది. పేరుకే గొప్ప కానీ.. ఎక్కడ చూసినా పట్టణంలో మురుగునీటి కుంటలు, కంపుకొట్టే కాలువలు, అపరిశుభ్రత ప్రజలను ఇబ్బంది పెడుతోంది. ప్రస్తుత వర్షాకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. పట్టణంలో 80 వేల జనాభా ఉంది. జనాభాకు తగ్గట్టు సుమారు 29 మంది కౌన్సిలర్లతో కూడిన పాలకవర్గం ఉంది. అయితే పాలకమండలి వైసీపీది కావడం, ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడం వల్ల పాలన గాడితప్పింది. ఇప్పటికి మున్సిపల్ పాలకమండలి ఏర్పడి నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. కనీసం మురుగునీటి కాలువలను కూడా శుభ్రం చేసుకోలేని పరిస్థితి. ప్రస్తుతం పట్టణంలో ఏ వీధి చూసినా అపరిశుభ్రతే కనిపిస్తోంది.

121 మంది ఉన్నా..

మున్సిపాలిటీలో గతంలో 91మంది పారిశుధ్య సిబ్బంది ఉడేవారు. వారిలో ఆరుగురు మృతచెందారు. మిగిలిన 85 మందిని 29 వార్డుల్లో పారిశుధ్య చర్యలకు నియమించారు. వీరికి పనిభారం పెరగడంతో పాలకమండలిలో చర్చించి 21 మందిని నియమించారు. వీరు కాకుండా కేవలం కాలువలు శుభ్రపరచడానికి 15 మందిని ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆప్కాస్ ద్వారా వీరి నియామకాలు చేసి ఒక్కొక్కరికి రూ.20 వేలు జీతం ఇస్తున్నారు. మొత్తంగా రాజంపేట మున్సిపాలిటీలో 121 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. విచిత్రం ఏంటంటే ఈ కార్మికులతో పనిచేయించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును ఎన్నో ఏళ్లుగా భర్తీ చేయడం లేదు. దీంతో ఆ యా సచివాలయాల శానిటరీ సెక్రటరీల పర్యవేక్షణలో పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. అయితే పారిశుధ్య కార్మికులకు ఇప్పటికి నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదు. కారణం ఏమిటంటే ఆప్కాస్ సొసైటీ ద్వారా రోజువారి వేతనం పేరిట నియమించిన వీరికి ఆడిటింగ్ ఇబ్బందులున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో పారిశుధ్యం పనులు చేసే కార్మికుల్లో ఉదాశీనత నెలకొంది.

ఏ వీధి చూసినా..

రాజంపేటలో ఎర్రబల్లె, ఉస్మాన్‌నగర్, మన్నూరు, ఈడిగపాళెం, కూరగాయల మార్కెట్, రామ్‌నగర్, బోయపాళెం, నూనెవారిపల్లె రోడ్డు, కొలిమివీధి, బలిజపల్లెరోడ్డు, తదితర అన్ని ప్రాంతాల్లోను కాలువలు అధ్వాన్నంగా ఉన్నాయి. మూడు నాలుగు రోజులకు కాని చెత్త తీయడం లేదు. హైవేరోడ్డుకు ఆనుకుని ఉన్న ఎర్రబల్లెలో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. తీసిన కాలువలపై కనీసం బండ రాళ్లు పెట్టకపోవడంతో వాహనదారులు గాయాల పాలవుతున్నారు. మిగిలిన వీధుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో దోమలు విజృంభించి విషజ్వరాల బారిన పడుతున్నారు.

అన్నీ ఉన్నా..

121 మంది శానిటరి సిబ్బందితో పాటు 2 పెద్ద ట్రాక్టర్లు, 2 చిన్న ట్రాక్టర్లు, ఒక పెద్ద కంపాక్టర్, 2 మినీ కంపాక్టర్‌లు, ఇతరత్ర అనేక వాహనాలు ఉన్నాయి. వాటికితోడు ఆకేపాటి విక్రమ్‌రెడ్డి ఇటీవలే కలెక్టర్ కార్యాలయంలో రాజంపేట పట్టణానికి ఆరు ఆటోలను విరాళంగా అందజేశారు. అన్ని వాహనాలను వినియోగించుకోవడంలో కూడా మున్సిపాలిటీ విఫలమయింది. పారిశుధ్య చర్యలకు వినియోగించే వాహనాల డీజిల్‌ను సంబంధిత అధికారులు సొంత వాహనాలకు వాడుకొంటున్నారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని వాహనాలు మూలనపెట్టేయడంతో అవి తుప్పు పడుతున్నాయి.



మురుగునీటి కాలువలో పేరుకుపోయిన చెత్త



రాజంపేట కూరగాయల మార్కెట్‌లో పేరుకుపోయి ఉన్న చెత్తా చెదారం

ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తున్నాం..



రాజంపేట పట్టణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు మెరుగుపరుస్తున్నాం. సుమారు 121 మంది సిబ్బందితో పనులు నిర్వహిస్తున్నాం. పారిశుధ్యంపై ఎక్కడి నుంచి ఫిర్యాదు వచ్చినా అప్పటికప్పుడే చర్యలు తీసుకుంటున్నాం. పాలక మండలి ఆదేశాలతో అన్ని వార్డుల్లో అపరిశుభ్రత లేకుండా చేస్తున్నాం. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం అన్నది అబద్ధం. ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

- శ్రీనివాసులు, కమిషనర్, రాజంపేట పట్టణం

అమ్మో.. రోడ్డు..!



శివాలయం వద్ద దెబ్బతిన్న రోడ్డు..

సిమెంటు రోడ్డుపై తారు వేసినా ఏర్పడిన గుంతలు

ఇద్దరి ప్రాణాలు బలి తీసుకున్న యూటర్న్ ఇదే..

పట్టణంలోని రోడ్లు నరకానికి నకళ్లుగా మారడంతో వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా లేనివారి ప్రాణాలు గాలిలో కలసి పోతున్నాయి. దీంతో ఈ రోడ్డుపై వెళ్లేందుకు ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.

రైల్వేకోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు దశాబ్దాల క్రితం రైల్వేకోడూరు పట్టణంలోని ఆర్టీసీ అప్రోచ్ రోడ్డు నుంచి వెంకయ్య స్వామి ఆలయం వరకు ప్రధాన రోడ్డును విస్తరించడంతోపాటు, సిమెంటు రోడ్డు, మధ్యలో డివైడర్ కూడా ఏర్పాటు చేశారు. అయితే, పనులు నాసిరకంగా చేయడంతో పూర్తైన కొంత కాలానికే అవి దెబ్బతినడం ప్రారంభించాయి. వాటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్న విషయాన్ని అధికారులతోపాటు, నాయకులూ పట్టించుకోకపోవడంతో చీలికలు పెద్దవై గోతులుగా మారాయి. ఈ విషయం గమనించకుండా వెళ్లే ద్విచక్ర వాహనదారులందరూ ప్రమాదంబారిన పడి గాయాలపాలయ్యారు.

బైపాస్ రోడ్డు లేకనే ప్రమాదాలు



పెద్ద, పెద్ద వాహనాలు వెళుతుండడంతో రోడ్డులో గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.ఎంత అప్రమత్తంగా ఉన్నా ప్రమాదాలు జరుతుగూనే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతలు పూడ్చడంతోపాటు, బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

- మండల సుబ్రహ్మణ్యం, రైల్వే కోడూరు

ప్రమాదాలను అరికట్టాలి



ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి, ద్విచక్ర వాహనదారులు చనిపోతూనే ఉన్నారు. రోడ్లు గత ప్రభుత్వంలో ఎలా ఉన్నాయో.. ప్రస్తుతం కూడా అలాగే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని రోడ్లను బాగు చేయాలి.

- మోతీలాల్, రైల్వే కోడూరు

వర్షం కురిసినప్పుడు ఈ ప్రమాదాల సంఖ్య మరీ అధికంగా ఉంటుంది. ఈ గోతుల కారణంగా అదుపు తప్పి పడిపోయిన ద్విచక్ర వాహనదారులు అదే మార్గంలో వేగంగా వెళుతున్న లారీల కింద పడి మృతి చెందిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇటీవల పట్టణంలోని రంగనాయకులపేటకు చెందిన బొక్కసం మహేంద్ర అనే యువకుడు నడుపుతున్న బైక్ యాక్సిస్ బ్యాంకు సమీపంలోని రోడ్డుపై ఉన్న గుంత కారణంగా అదుపుతప్పి కింద పడగా, వెనుక నుంచి వస్తున్న లారీ అతనిమీదుగా వెళ్లి పోయింది. పట్టణంలోని బలిజ వీధికి చెందిన నరేంద్ర అనే ఆర్ఎంపీని యూటర్న్ తీసుకునే క్రమంలో వేగంగా వచ్చిన ఓ ప్రైవేటు అంబులెన్సు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలా ఈ ఏడాది వ్యవధిలో ఈ రోడ్డుపై ప్రమాదాల కారణంగా పది మంది మృతి చెందారు. సుమారు 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఆర్టీసీ అప్రోచ్ రోడ్డు నుంచి తులసీ స్కూలు వరకు, హోండా షోరూం, టీవీఎస్ షోరూం, లక్ష్మీపార్వదైజ్ సినిమా హాలు, సుజుకీ షోరూం, యాక్సిస్ బ్యాంకు ఎదురుగా, శివాలయం తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్డుకు ఈ మధ్య కాలంలోనే మరమ్మతులు చేసినా ఫలితం లేకుండా పోతోంది. పట్టణంలోని హీరో షోరూం ఎదురుగా ఏర్పాటు చేసిన యూటర్న్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యి. కాగా ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు కూడా.

వాహనాల రద్దీతోనే..

పట్టణంతోపాటు చుట్టుపక్కల మండలాల్లో అరటి, బొప్పాయి తదితర ఉద్యాన పంటలు ఎక్కువగా సాగవుతాయి. పట్టణానికి పక్కనే ఉన్న మంగంపేట గ్రామం వద్ద బైరైటీస్ గనులు ఉన్నాయి. ఇక అతి సమీపంలోనే తిరుమల క్షేత్రం ఉంది. సమీపంలోనే చెన్నై హార్బరు కూడా ఉంది. ఈ నేపథ్యంలో కార్లు వంటి చిన్న వాహనాలతో పాటు, వందలాది టన్నుల బరువైన యంత్రాలను తరలించే భారీ వాహనాలు సైతం ప్రతి రోజూ పెద్ద ఎత్తున రైల్వే కోడూరు పట్టణంలోని రోడ్డు మీదుగానే ప్రయాణిస్తుంటాయి. ఈ వాహనాల ఒత్తిడి కారణంగానే రోడ్డు దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, బైపాస్ రోడ్డు నిర్మించి పట్టణంలో వాహనాల రద్దీని తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం

- ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి విద్యాసాగర్

రాయచోటి టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఆలపాటి విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నేతాజీ సర్కిల్ మీదుగా బస్టాండు వరకు ఉద్యోగులు, పెన్షనర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 13 జిల్లాలకే పరిమితమైన ఏపీ ఎన్జీవో సంఘం కమిటీలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లాలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగ సంఘాలను పిలిపించి డీఏ, హెల్త్ కార్డులు, ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇన్సూరెన్స్, ఉద్యోగినులకు చైల్డ్ కేర్ లీవ్ వాడుకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. మూడేళ్లుగా ప్రమోషన్లు లేక ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు కల్పించాలని రాష్ట్ర యంత్రాంగానికి, చీఫ్ సెక్రటరీకి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గత ఆరేళ్లుగా ఉద్యోగులు చీకటి యుగంలో మగ్గారని తెలిపారు. గత ప్రభుత్వం 3600 మందిపై కేసులు బనాయించిందన్నారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.32,500 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు తొలగించిన 950 మంది ఎంపీహెచ్ఏలకు న్యాయం చేయాలని కోరామన్నారు. ఏపీఎన్జీవో సంఘ కమిటీలను గ్రామ స్థాయిలో సైతం ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, రాష్ట్ర కార్యదర్శి శివప్రసాద్, ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి నిత్య పూజయ్య, అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవులు, రమేశ్, తిరుపతి అధ్యక్షుడు సురేశ్, కడప తాలూకా అధ్యక్షుడు చిన్నయ్య, కోశాధికారి నాగార్జున, ఉపాధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరారెడ్డి, జాయింట్ సెక్రటరీ మోహన్‌రెడ్డి, రాయచోటి ఎన్జీవో సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి మహదేవ, కోశాధికారి దేవేంద్ర, ఉమెన్ వింగ్ చైర్మెన్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో బీహార్ జడ్జి

బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అరుణ్‌కుమార్ జహ శుక్రవారం హార్సిలీహిల్స్‌కు విచ్చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు అధికారులు గవర్నర్ బంగ్లాలో విడిది ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ మేరకు తహసీల్దార్ బావాజాన్, బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి స్వాగతం పలికారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ములకలచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కాలువపల్లె పంచాయతీ బుద్దలవారిపల్లెకు చెందిన మంచినీళ్ల నరసింహులు(64), మద్యం తాగేందుకు భార్య డబ్బులివ్వలేదన్న కోపంతో ఈ నెల 7 న గడ్డి మందు తాగాడు. తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య కదిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

హోటళ్లలో 'ఆహార భద్రత' తనిఖీలు



ఓ హోటల్ వంటశాలలో తనిఖీలు చేస్తున్న ఆహార భద్రత అధికారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా అధికారులు, మున్సి పల్ అధికారులతో కలసి తనిఖీలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా ఆహార భద్రతా అధికారి కేఎస్ బాషా ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని గోంగూర, సంతృప్తి, ఆంధ్ర స్పైస్, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పిట్టాస్ బావార్చి, రెడ్ బకెట్ బిరియాని, కేఎఫ్‌సీ తదితర హోటళ్లలో, బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంట గదులతో పాటు, ఆహారం వడ్డించే ప్రదేశాల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. కొన్ని హోటళ్లలో అపరిశుభ్రంగా ఉండటంతో నోటీసులు జారీ చేసినట్లు కేఎస్ బాషా తెలిపారు. మిగిలిన హోటళ్ల నిర్వాహకులకు తగు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.

ఘాట్ రోడ్డులో నేలకొరిగిన వృక్షం

బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హార్సిలీ హిల్స్ ఘాట్ రోడ్డులోని నాలుగో మలుపు వద్ద శుక్రవారం ఓ భారీ వృక్షం నేలకొరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో కొండ చరియల్లోంచి వస్తున్న నీరు ఘాట్ రోడుపై ప్రవహిస్తోంది. ఈ ప్రవాహం కారణంగా వృక్షాలు కూలిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చెట్టు కొమ్మలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

అనాథ మృతదేహం చెంగల్రాయులుగా గుర్తింపు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం సమీపంలో గురువారం రాత్రి మృతి చెందిన వ్యక్తి పలమనేరు మండలం, గంగవరం, పాతూరుకు చెందిన చెంగల్రాయులు (64)గా గుర్తించారు. ఆయన కుటుంబసభ్యులు శుక్రవారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు. వారి కథనం మేరకు తంబళ్లపల్లె మండలం, కోసువారిపల్లెలో ఉన్న కూతురు భారతి ఇంటికి వెళుతున్నట్లు చెప్పి ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిన చెంగల్రాయులు కూతురి ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో సీటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందడంతో ఆయన భార్య కాంతమ్మ ఆస్పత్రికి చేరుకుని మృతి చెందినది తన భర్తేనని గుర్తించారు.

'మద్యం కేసు నిందితుడు మాజీ సైనికుడు కాదు..!'

మదనపల్లె టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ పోలీసులకు బుధవారం మద్యంతో పట్టుబడింది మాజీ సైనికుడు కాదని మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్దకు వచ్చిన ఆయన మాట్లాడుతూ 41 సీసాల మద్యంతో పట్టుబడిన రమేశ్ అనే వ్యక్తి మాజీ సైనికుడు కాదని, అసలు తమ డివిజన్‌లో అతని పేరు నమోదు కాలేదన్నారు. ప్రజలను అధికారులను తప్పుదోవ పట్టించేందుకు ఇలా చెప్పి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

వరి పొలాలపై అడవిపందుల దాడి

సుండుపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరి మళ్లలో పందుల స్వైరవిహారంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం రాత్రి కటారు ముడుకుకు చెందిన నరసప్పనాయుడు, మద్దిలేటి నాయుడు, అయ్యలవారిపల్లెకు చెందిన సుబ్బరాములతో పాటు మరికొంత మంది రైతుల పొలాల్లో అడవి పందులు దాడి చేసి నష్ట పరిచాయి. శుక్రవారం వ్యవసాయశాఖ సిబ్బంది రాధమ్మ ఆయా పొలాలను పరిశీలించారు.ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు. నష్టనివారణ కోసం ప్రభుత్వానికి మంజూరు చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



పీలేరు: డివైడర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

ములకలచెరువు, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా ము గ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పాత ములకలచెరువు పంచాయతీ దుగుసానివారిపల్లెకు చెందిన ఆంజనేయులు కుమారుడు అనిల్ కుమార్(28), సత్యసాయి జిల్లా తనకల్లు మండలం బొంతలపల్లెకు చెందిన సునీల్(24)తో కలసి గురువారం రాత్రి ద్విచక్ర వాహ నంలో ములకలచెరువుకు వస్తుండగా ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలోని ఇరానీ చాయ్ దుకాణం వద్ద వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సునీల్‌ను మదనపల్లెలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సోనియా, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

వాల్మీకిపురం : పీలేరు పట్టణంలోని పద్మావతి నగర్‌కు చెందిన ఎస్.సయ్యద్ బాషా(45) ట్రాక్టర్ ఇంజన్‌తో వాల్మీకిపురం మండలం చెరుకువారిపల్లె సమీపంలో రాంగ్ రూట్‌లో వెళుతుండగా చెన్నైకి వెళుతున్న బొలెరో వాహనం ఎదురుగా వచ్చింది. రెండు వాహనాల డ్రైవర్లూ వాహనాలను అదుపు చేయలేకపోవడంతో డివైడర్‌ను ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సయ్యద్‌బాషా, బొలెరో వాహనంలోని శ్రీనివాసమూర్తి, శివశంకర్ రెడ్డిలను పీలేరు ఆస్పత్రికి తరలించారు. సయ్యద్‌బాషా పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్టు

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్ర చందనం అక్రమ రవాణా కేసుల్లో కడప జిల్లా చాపాడు మండలం ఖాదర్‌పల్లెకు చెందిన చీంపర్తి ఫక్రుద్దీన్ (గోరేసాబ్ ఫక్రుద్దీన్/పొంగోడు) ను పీడీ యాక్టు కింద నిర్బంధించడాన్ని నిర్ధారిస్తూ ప్రభుత్వం శుక్ర వారం ఆదేశాలు జారీ చేసింది. ఎర్రచందనం స్మగ్లర్ ఫక్రుద్దీన్‌ను పీడీ యాక్టు కింద నిర్బంధించాలని గత నెల 2న కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే అతనిపై 8 వేర్వేరు రకాల కేసులుండగా, గతంలో పీడీ యాక్టు కింద ఒకసారి నిర్బంధించినా, విడుదలయిన తర్వాత అక్రమ రవాణా కార్యకలాపాలను కొనసాగించాడని, అతనిని పీడీ యాక్టు కింద నిర్బంధించడం వినా మార్గం లేదని కలెక్టరు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను గత నెల 11న ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్బంధించిన అనంతరం మూడు వారాల్లోగా పీడీ యాక్టు కింద ఏర్పాటయిన రాష్ట్ర న్యాయ సలహా బోర్డు విచారించి నిర్బంధాన్ని సమర్థించాల్సి ఉంది. ఈ మేరకు సెప్టెంబరు 26న ముగ్గురు సభ్యులతో కూడిన సలహా బోర్డు ఫక్రుద్దీన్‌తోపాటు, విచారణాధి కారిని వీడియో కాన్ఫరెన్సు ద్వారా విచారణ చేసింది. అతనిని నిర్బంధించడానికి కారణాలను, ఆధారాలను పరిశీలించిన సలహా బోర్డు.. కలెక్టరు చర్యలను, ప్రభుత్వం ఆమోదాన్ని సమర్థిస్తూ నివేదిక అందజేసింది. దీంతో ఈ ఏడాది సెప్టెంబరు 5 నుం చి 12 నెలలపాటు పీడీ యాక్టు కింద నిర్బంధించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

లీజు గడువు ముగిసినా.. కొనసాగుతున్నారు

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దచెరువు లీజు గడువు ముగిసినా ఇప్పటికీ గత వేలం దారులే కొనసాగుతున్నారని పోతుపేట పంచాయతీ పిడుంవారిపల్లె గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా పెద్ద చెరువులో చేపలు పట్టుకునే హక్కులు దక్కించుకున్నవారు.. గడువు ముగిసినా ఇప్పటికీ కొనసాగుతున్నారని ఆరోపించారు. చెరువులోకి తమ గ్రామస్తులను రానివ్వకపోగా.. కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు దీనిపై పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

పిడుగుపాటు బాధిత కుటుంబానికి పరిహారం

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేవీ పల్లె మండలం నూతనకాల్వ పంచాయతీ నడింపల్లెకు చెందిన పిడుగుపాటు బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కుటుంబానికి చెందిన జోతా నాగరాజు గత ఏడాది అక్టోబరు 20న పిడుగుపాటుకు గురై మరణించగా బాధిత కుటుంబానికి పరిహారంకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. బాధిత కుటుంబానికి పరిహారం సొమ్మును వెంటనే చెల్లించాలని కలెక్టరును రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హౌస్‌బిల్డింగ్ సొసైటీ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవమైన కమిటీ సభ్యులతో అఫిషియల్ పీఐసీ ప్రవీణ్‌కుమార్

మదనపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో- ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీమయ్యాయి. ఇందులో ఒకే ప్యానల్ నుంచి ఎనిమిది మంది సభ్యులు నామినేషన్లుదాఖలు చేశారు. శుక్ర వారం నామినేషన్ల ఉపసంహరణలో ఒక అభ్యర్థి పోటీ నుంచి తప్పుకోవడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సొసైటీ కాలనీలోని సహకారశాఖ డివిజన్ కార్యాలయంలో ఎన్నికైన సభ్యులకు డిక్లరేషన్ పత్రాలు అందజేశారు. ఏకగ్రీవమైన సభ్యులు బి.మహేశ్‌కుమార్, ఎస్.రెడ్డెప్ప, కె.వీరవెంకటశివాజీ, బి.శివానంద నాయక్, కె.వెంకటాచలపతి, ఎస్.రెడ్డిషామీర్, యు. నరేష్ ఉన్నారు. శనివారం ఉదయం 10:30గంటలకు స్థానిక కార్యా లయంలో మదనపల్లె హౌస్‌బిల్డింగ్ సొసైటీ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఎన్నికల జరగనున్నట్లు ఎన్నికల అధికారి రాజశేఖర్‌రెడ్డి, అఫీషియల్ పీఐసీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇందులో రెండో వర్గం వివిధ కారణాలు చూపుతూ ఎన్నికలు ఆపేందుకు న్యాయస్థానానికి వెళ్లినట్లు చెబుతున్నారు.

'గుమ్మసముద్రం'తో రాకపోకలకు అంతరాయం



రోడ్డుపై ప్రవహిస్తున్న గుమ్మసముద్రం మొరవనీరు

బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మసముద్రం చెరువుకు రెండు వైపులా మొరవలున్నాయి. ప్రస్తుతం చెరువు నిండడంతో రెండు రోజులుగా కుడివైపు మొరవ నుంచి నీటిని వదిలారు. ఎడమ వైపు నుంచి నీరు విడుదలైతే హంద్రీనీవా కాల్వలోకి చేరి కాల్వ దెబ్బతింటుందన్న ఉద్దేశంలో అధికారులు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వరద ఉధృతి పెరగడంతో నీరు మదనపల్లె బి.కొత్తకోట రహదారిపై ప్రవహించింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. తహసీల్దార్ బావాజాన్ చెరువు వద్దకు చేరుకుని హంద్రీనీవా అధికారులతో మాట్లాడారు. గత్యంతరం లేని పరిస్థితిలో ఎడమవైపు మొరవపై వేసిన ఇసుక బస్తాలను తొలగించి రెండు వైపులా నీటిని విడుదల చేశారు. దీంతో రాకపోకలు కొనసాగాయి. హంద్రీనీవా కాల్వలోకి నేరుగా మొరవ నీరు వస్తుండడంతో అధికారులు కాల్వ తెగిపోకుండా తగుజాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాగా మొరవ నీటిని, చెరువు అందాలను చూసేందుకు బి.కొత్తకోట పట్టణ వాసులు సహా చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం గుమ్మసముద్రం చెరువు వద్దకు వస్తున్నారు.

చెరువులు, కుంటల పరిశీలన



మర్రిఒడ్డుచెరువు తూములను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారుల

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా మండలంలోని చెరువులు కుంటలను శుక్రవారం ఇరిగేషన్ డీఈ చెన్న కేశవరెడ్డి, జేఈ సతీష్‌గౌడ్ పరిశీలించారు. ఇందులో భాగంగా టి.సదుం పంచాయతీ తుమ్మల చెరువుకట్ట రెండు మూడు చోట్ల ప్రమాదకరంగా మారినట్లు గుర్తించారు. మల్లెల గ్రామ సమీపంలో ఉన్న మర్రిఒడ్డు చెరువు మొరవ పోతుండడంతోపాటు, తూముల నుంచి నీరు వృథాగా పోతుండ డంతో గ్రామస్తుల సహకారంతో ఇసుక మూటలు వేయించి కట్టడి చేశారు. ఎక్కడైనా చెరువులు కుంటలు ప్రమాదకరంగా అనిపిస్తే వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు అందు బాటులో ఉండి ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేయాలని వీఆర్వోలు, వీఆర్ఏలకు ఆదేశించారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఏపీఓ ఢిల్లీ బాబు, మల్లెల సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, వీఆర్వో శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి నాగరాణి, మల్లెల సీనియర్ టీడీపీ నేత కుందిలి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన బేస్‌బాల్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేశ్, పీడీ సోమశేఖర్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన పోరుమామిళ్లలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అరవింద్, ఓంప్రసన్న విజేతలుగా నిలిచారు. వీరు నవంబరు 8, 9 తేదీల్లో రైల్వేకోడూరులో నిర్వ హించనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్-17 విభాగంలో డీ. చందన విజయం సాధించి ప్రకాశం జిల్లాలో జరగబోవు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలకు మదనపల్లె విద్యార్థిని



శరణ్య

మదనపల్లె టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మదనపల్లె విద్యార్థిని శరణ్య ఎంపికైందని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్‌పర్సన్ అమృత తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో ఈ నెల 23న నిర్వహించిన అండర్-17 బాలికల విభాగం బాడ్మింటన్ పోటీల్లో పి.శరణ్య పాల్గొని దన్నారు. ఆమె ప్రతిభ మెచ్చిన సెలెక్టర్లు నవంబర్ నెలలో రాష్ట్ర స్థాయి పోటీలకు చిత్తూరు జిల్లా జట్టు తరపున పాల్గొనేందుకు ఎంపిక చేశారన్నారు. శరణ్యను రెండో చైర్‌పర్సన్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ షెహనాజ్, పీఈటీలు అభినందించారు.

గురుకుల విద్యార్థినికి సూపర్ జీఎస్టీ అవార్డు



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సోమశేఖర్

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): కలికిరి జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల పదవ తరగతి విద్యార్థిని కె.ఖ్యాతి రాష్ట్ర స్థాయి సూపర్ జీఎస్టీ అవార్డు కైవసం చేసుకుంది. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ 2.0పై ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అవార్డుకు ఎంపికయ్యింది. గత వారం కర్నూలులో సూపర్ జీఎస్టీపై జరిగిన సమావేశంలో ప్రధాన మంత్రి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవాల్సి ఉండగా, షెడ్యూల్‌లో మార్పుల కారణంగా అవార్డు ప్రదానం వాయిదా పడింది. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల నుంచి ఎంపికయిన 17 మంది అవార్డు విజేతలను అభినందించారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయంలో అవార్డులు అందజేశారు. దీంతోపాటు గురువారం కలెక్టరు ప్రశంసా పత్రం, జ్ఞాపిక, రూ.ఐదు వేల నగదు అందజేశారు. శుక్రవారం విద్యార్థినిని ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

మదనపల్లె అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):స్థానిక బీటీ కళాశాల మైదానంలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా హ్యాండ్‌బాల్ బాల బాలికల జిల్లా జటన్లు ఎంపిక చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు నాగరాజు, ఝాన్సీరాణి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 15 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన జట్లు గుంటూరులో బాలికల చాంపియన్‌షిప్, ఎన్టీఆర్ జిల్లాలో బాలుర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. శివ, క్రీస్తే, సంధ్య, ప్రసాద్, నరేష్‌బాబు, దిలీప్, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్, కిరణ్, రెడ్డివరప్రసాద్, మహేంద్ర, బాలజీ, తదితరులు పాల్గొన్నారు.

సురక్షయాప్‌తో నకిలీ, కల్తీ మద్యానికి చెక్

● కొన్నచోటే వినియోగదారుడు పరిశీలించవచ్చు
● స్కాన్‌చేయగానే బాటిల్ చరిత్ర ప్రత్యక్షం

బద్వేలుటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన మద్యం వినియోగదారుడికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మద్యం కొన్న వెంటనే దుకాణం వద్దే చెక్‌చేసుకునేందుకు వీలు కల్పించింది. ఈ క్రమంలోనే ఓ సరికొత్త యాప్‌ను తీసుకువచ్చింది. దీని ద్వారా వినియోగదారుడు తానుకొనే మద్యం అసలైందా లేక నకిలీ మద్యమా అనే విషయం అక్కడికక్కడే తెలిసిపోతుంది. సురక్షయాప్ ద్వారా స్కాన్‌చేస్తే చాలు తాను కొన్న లిక్కర్‌బాటిల్ సంస్థ వివరాలు కస్టమర్స్‌కు కన్పించేలా ఈ యాప్‌ను రూపొందించారు. లిక్కర్ ధర.. ఎక్కడ తయారైంది.. ఏ బ్రాండ్.. ఏ డిపోనుంచి సప్లై చేశారు.. ఇలా అన్ని వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. ఇది ఏపీ ఎక్సైజ్ సురక్షయాప్. ఈ యాప్ ద్వారా అటు కష్టమర్లు తాము తాగేలిక్కర్ నాణ్యతను తెలుసుకునేందుకు, రీటేల్ దుకాణదారుడు అమ్మకాలు తెలుసుకోవడానికి ప్రభుత్వం దీన్ని తీసుకువచ్చింది.

సురక్షయాప్‌ను సులభంగా వాడవచ్చు

ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఎవరైనా సులభంగా వాడవచ్చు. కష్టమర్లు,



సురక్షయాప్ ద్వారా లిక్కర్ బాటిల్‌ను స్కాన్‌చేసి పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఆన్డ్రాయిడ్ సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఇన్‌స్టాల్ కాగానే కష్టమర్స్, రీటైల్ ఆప్షన్ చూపుతుంది. కష్టమర్ ఆప్షన్‌ను ఎంపిక చేయాలి. తరువాత కష్టమర్స్ తాము కొనుగోలు చేసే లిక్కర్ బాటిల్‌పై ఉన్న స్టిక్కర్(అలోగ్రాఫ్)ను యాప్‌లోని స్కానర్ ద్వారా స్కాన్‌చేసి కింద సెక్యూరిటీ కోడ్‌ను ఎంపిక చేయగానే ఆ బాటిల్ వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. ముఖ్యంగా ఆ మద్యం బ్రాండ్‌పేరు, ఆ బాటిల్ ఎంఎల్ సైజు, బ్యాచ్ ఐడీ, ఎమ్మార్పీ, తయారు చేసిన కంపెనీ వివరాలు, తేదీ, సమయం, అది ఏ లిక్కర్ డిపో నుంచి సప్లయ్ చేశారు వంటి వివరాలు క్షణాల్లో తెలిసిపోతాయి. ఒకవేళ స్కాన్ చేసిన వివరాలు నాట్‌ఫౌండ్ లేదా ఇన్‌వాలిడ్‌స్టాక్ అని వస్తే అది నకిలీ మద్యంగా భావించవచ్చు. కష్టమర్స్ ఫిర్యాదు చేయకుండానే ఆ వివరాలు ఎక్సైజ్‌శాఖ దృష్టికి వస్తాయి. ఈ సురక్షయాప్ వల్ల కష్టమర్స్ నకిలీ మద్యం బారి నుంచి కాపాడుకునేందుకు వీలు ఉంటుంది.

మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఎక్సైజ్ సురక్ష మొబైల్‌యాప్ ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మద్యం దుకాణాలు, బార్లల్లో నకిలీ మద్యం అమ్ముతున్నారనే వదంతులను ఎవరూ నమ్మవద్దు. కొందరు పనికట్టుకొని చెడుప్రచారం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రత్యేకంగా తీసుకువచ్చింది. దీనిని మొబైల్ ద్వారా వినియోగించుకోవచ్చు.
-ఎం.జయరాజ్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషన్ అధికారి

సీబీఆర్‌కు భారీగా వరద నీరు



సీబీఆర్ ప్రాజెక్టులో నీటి నిల్వ

లింగాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సీబీఆర్‌కు భారీగా వరదనీరు చేరుతోంది. శుక్రవారం ఉదయానికి 500 క్యూసెక్కులతో ప్రారంభమైన వరద క్రమేపి 2500 క్యూసెక్కులకు పెరగ డంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఇప్పటికే ప్రాజెక్టులో 9టీఎంసీల వరకు నీరు ఉండటంతో వరద మరింత పెరిగితే చిత్రావతి నదిలోకి నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే సాయంత్రం వరద 1100 క్యూసెక్కులకు పడిపోవడంతో నదికి నీటి విడుదల వాయిదా వేశారు. ప్రాజె క్టు పూర్తిసామర్థ్యం పది టీఎంసీలు. ఆర్డీఓ చిన్నయ్య, డిప్యూటీ తహసీల్దార్ నరేంద్ర, ఎస్‌ఐ అనిల్‌కుమార్ ప్రాజెక్టును పరిశీలించి నది పరివాహక ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా నదిలోకి నీటి విడుదల నిర్ణయం తీసుకుంటామని పీబీసీ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎల్ఎస్‌పీ డ్యాంకు....



డ్యాం నుంచి నీటి విడుదల

బి.కోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని లోయరు సగి లేరు ప్రాజెక్టు (ఎల్ఎస్‌పీ)కు నాలుగురోజుల నుంచి ఎగువన భారీగా కురుస్తున్న వర్షాలకు అధికంగా నీరు వచ్చి చేరుతుంది. దీంతో శుక్రవారం ఇరిగే షన్ డీఈ వేణుగోపాలరెడ్డి 1700 క్యూసెక్కులు దిగువకు సగిలే టికి వదలగా 250 క్యూసెక్కుల నీటిని బద్వేలు పెద్ద చెరువుకు విడుదల చేశామని తెలి పారు. వరద పెరిగితే దిగువకు నీటి విడుదల పెంచుతా మని, సగిలేటికి ఇరువైపులా ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఉధృతంగా సగిలేరుకు...



సగిలేరు ఆనకట్టపై వరదనీళ్లు

కలసపాడు,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎగువన గిద్దలూరు ప్రాంతంలోని నల్లమల అడవుల్లో నాలుగురోజుల పాటు కురిసిన వర్షాలతో సగిలేరుకు ఉధృతంగా వర్షపునీరు వస్తోంది. కలసపాడు మండల పరిధిలోని దిగువ తంబళ్లపల్లె వద్ద ఉన్న ఆనకట్ట ద్వారా కలసపాడు చెరువుకు నీరు చేరి నిండు కుండలా ఉంది. భారీ వర్షానికి మండలంలోని పలు చెరువులకు ఓ మోస్తరు వర్షపునీరు చేరింది. మండలంలో అక్కడక్కడ వరి మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గండికోటకు 1565 క్యూసెక్కులు..



గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం

కొండాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెన్నా, చిత్రావతి నదులతో పాటు స్థానికంగా కురిసిన వర్షాల వల్ల వాగులు, వంకల ద్వారా శుక్రవారం గండికోట ప్రాజెక్టులోకి 1565 క్యూసెక్కుల వరదనీరు చేరినట్లు ఈఈ ఉమా మాహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా అవుకు రిజర్వాయిర్ నుంచి 500 క్యూసెక్కుల కృష్ణాజాలలు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 26.207 టీఎంసీల నీటిమట్టం ఉంది.

తక్షణం మెడిసిన్ అందుబాటులో ఉంచాలి

● విద్యార్థుల డిమాండ్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఆరోగ్య కేంద్రంలో మెడిసిన్ లేకపోవడం సిగ్గుచేటని, తక్షణం మెడిసిన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం వైవీయూ ప్రధాన ద్వారం వద్ద టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైవీయూ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు భరత్‌సింహ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రంలో గత కొన్ని నెలలుగా మందులు అందుబాటులో లేవని, విద్యార్థులు కడప నగరానికి వెళ్లి సొంత ఖర్చులతో వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాలు, మెస్ పరిసరాల్లో అపరిశుభ్రత, స్నానాల గదుల్లో కొళాయిలు, తలుపులు లేని పరిస్థితి కారణంగా వ్యాధులు వ్యాపిస్తున్నాయని తెలిపారు. గ్రంథాలయం, ఆర్ట్స్ అండ్ కామర్స్ భవనం, వసతి గృహాలపై వైపై సదుపాయం కల్పించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కాగా, విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో పెండ్లిమర్రి సీఐ దొర మధ్యవర్తిత్వం చేసి రిజిస్ట్రార్‌తో జరిపిన చర్చలు విఫలమయ్యాయని, త్వరలో అన్ని విద్యార్థి సంఘాలతో ఉమ్మడి కార్యాచరణ చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో కిషోర్, గంగన్న, సాయికృష్ణ, ఉమర్‌బాష, బెంజమిన్, రాకేష్, నవీన్, ప్రభు, గణేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వైవీయూ అధికారులు, పోలీసులు

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

సీకేదిన్నె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు శాస్త్రవేత్తలు మెరుగైన సేవలు అందించాలని ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ తెలిపారు. మండలంలోని కొలుములపల్లె, ఇప్పెంట గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రైతుల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకుని పంట ఖర్చును తగ్గించి ఆదాయ మార్గాలు పెంచాలన్నారు. ఈ ప్రాంతానికి అనుకూలమైన పంటల సరళితో మార్పు చేసి రైతుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కొలుములపల్లెలో వ్యవసాయం వైపు యువతను ఆకర్షించడం, నిలుపుకోవడం (ఆర్య పథకం)కింద సరఫరా చేసిన వర్మీకంపోస్టు యూనిట్లను, తమలపాకు తోటలను పరిశీలించారు. దేశవాలీ కోళ్ల పెంపకం ద్వారా రైతులు వ్యవసాయంతోపాటు అదనపు ఆదాయం పొందేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా తిరుపతి, మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో తెలుసుకున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతితో కలిసి కేవీకే ఆధ్వర్యంలో ఉన్న పుట్టగొడుగులు, వర్మీకంపోస్టు, కోళ్లపెంపకం కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త క్రిష్ణప్రియ, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేశ్‌బాబు, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొలుములపల్లెలో రైతులతో మాట్లాడుతున్న శివనారాయణ

యువజనోత్సవాలలో యువత విరివిగా పాల్గొనాలి

కడప నాగరాజుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యువజనోత్సవాలలో యువత విరివిగా పాల్గొనాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం కడపలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజనోత్సవాలు-2025లో భాగంగా విద్యార్థులకు ఫోక్ డ్యాన్స్, ఫోక్ సాంగ్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ యువత చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కాగా, యువజనోత్సవాలలో జిల్లా నలుమూలల నుంచి వివిధ పోటీలలో పాల్గొనేందుకు దాదాపు 485 మంది పేర్లను నమోదు చేసుకున్నారు. శుక్రవారం నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సెట్ప్ సీఈఓ జోయల్ విజయ కుమా ర్, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్‌కుమార్, స్పిరిట్స్ కళాశాల డైరెక్టర్ రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.



యువజనోత్సవాల సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

రోడ్డు భద్రతపై ఎస్పీ స్పెషల్ డ్రైవ్



వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ నచికేత్

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కడప నగరంలోని పలు కూడళ్లల్లో ఎస్పీ స్వయంగా వాహనాలను తనిఖీ చేశారు. సెవెన్‌రోడ్స్, క్రిష్ణ, అప్సర, అంబేద్కర్, ఐటీఐ, ఊటుకూరు తదితర సర్కిళ్లలో జరుగుతన్న స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మైనరు డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, రికార్డులు లేనివాహనాలు, కంపెనీ ఫిట్టెడ్ సైలెన్సర్‌లను కాకుండా ఇతర సైలెన్సర్‌లను వాడడం, అనధికారికంగా సైరన్‌లను వాడేవారిపై, వివిధ శాఖల పేరుతో నకిలీ నెంబరు ప్లేట్‌లు కలిగి ఉన్న వారిపై, డ్రంకెన్ డ్రైవ్, ఓవరు లోడింగ్, అతివేగంతో నడిపే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ఎస్పీ తెలిపారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట పోలీసు అధికారులు ఉన్నారు.

నేను కష్టపడతా..మీరు కష్టపడండి

● వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నేను కష్టపడతాను.. మీరు కష్టపడి పనిచేయాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వ విద్యాలయం పాలనలో పారదర్శకత, వేగం ఉండాలని, ఫైల్ క్లియరెన్స్ లో ఆలస్యం చేయరాదని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పేపర్‌లెస్ ఆఫీస్ విధానాన్ని పూర్తిగా అమలు చేయాలని ఆదేశించారు. తర్వాత ఆర్ట్స్ బ్లాక్‌ను పరిశీలించిన ఆయన విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కంప్యూటర్ ల్యాబ్ సందర్శించి విద్యార్థులతో సాంకేతిక అంశాలపై మాట్లాడారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార భద్రత పథకాన్ని అమలు చేయాలి

● వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్

కడప రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండల స్థాయిలలో జాతీయ ఆహార భద్రత, పోషణమిషన్ పథకాన్ని అమలు చేసి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా వ్యవసాయశాఖ సమావేశ హాలులో జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులకు జాతీయ ఆహార భద్రత మరియు పోషణ మిషన్‌పై శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత పోషణ మిషన్ పథకం ప్రయోజనాలను నెరవేర్చాలన్నారు. అనంతరం పథకాన్ని మండల, గ్రామ స్థాయిలో అమలు చేసే విధివిధానాలపై తెలియజేశారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పులివెందుల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా అరుణాచలం క్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం పులివెందుల డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. అక్టోబరు 26, నవంబరు 2, 9, 16వ తేదీలలో పులివెందుల నుంచి ఉదయం 7గంటలకు అరుణాచలానికి బస్సు బయలుదేరుతుందన్నారు. నవంబరు 4వ తేదీ కార్తీక పౌర్ణమి రోజు ఉదయం 7గంటలకు పులివెందుల డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు వివరించారు. సూపర్ లగ్జరీ బస్సుకు రానుపోను చార్జీ రూ.1200గా నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో పాటు కార్తీకమాసంలో ప్రతి సోమవారం అక్టోబరు 26వ తేదీ, నవంబరులో 2, 9, 16వ తేదీలలో ఉదయం 6.30 గంటలకు శ్రీశైలానికి స్పెషల్ సర్వీస్ అల్ట్రా డీలక్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు రాను పోను చార్జీ రూ.1280 అన్నారు.

నేడు పొలతల ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

పెండ్లిమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం శనివారం ఉదయం జరగనుందని ఆలయ ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఓ మాట్లాడుతూ చైర్మన్‌గా శిరిగిరెడ్డి రాజారెడ్డి, పాలక మండలి సభ్యులుగా 11 మంది ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిలు హాజరు కానున్నారని తెలిపారు. అనంతరం కార్తీకమాస ఉత్సవాల ఏర్పాట్లపై మండల స్థాయి అధికారులతో ఈవో చర్చించారు.

వర్షానికి కూలిన మిద్దె కప్పు.. మూడు గేదెలు మృతి



చాపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామంలో గురువారం రాత్రి మిద్దె పైకప్పు కూలడంతో మూడు గేదెలు మృతి చెందాయి. గ్రామంలోని మార్తల ఓబుళరెడ్డి 30 ఏళ్ల క్రితం ఈ మిద్దెను నిర్మించారు. ప్రస్తుతం దీనిని పశువులపాకగా ఉపయోగిస్తున్నారు. రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురువడంతో మిద్దె పైకప్పు కూలి గేదెలు మృతి చెందాయి. గేదెల విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటాయని బాధితుడు తెలిపారు. చాపాడు పశువైద్య అధికారి మహమ్మద్‌గౌస్, వీఆర్వో రాజశేఖర్‌రెడ్డి మృతిచెందిన గేదెలను పరిశీలించారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు నివేదిక పంపుతున్నట్లు వీఆర్వో తెలిపారు.

ఎంఆర్ హోండా షోరూంలో బంపర్ డ్రా

● దసరా దీపావళికి యాక్టివా వాహనాలు కొన్నవారికి బహుమతులు



ఎంఆర్ హోండా దసరా లక్కీ డ్రా తీస్తున్న ఎండీ మహేంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా దీపావళి సందర్భంగా ప్రొద్దుటూరులో ఎంఆర్ హోండా షోరూంలో యాక్టివా వాహనాలు కొన్నవారికి బంపర్ డ్రాలో బహుమతులు ప్రదానం చేశారు. శుక్రవారం మైదుకూరు రోడ్డులోని ఎంఆర్ హోండా షోరూంలో దసరా, దీపావళి బంపర్ డ్రా తీశారు. ఇందులో మొదటి బహుమతి కె.కొండారెడ్డికి యాక్టివా -125 కొన్నందుకు బంపర్ డ్రాలో 55 ఇంచుల గూగుల్ టీవీ, రెండో బహుమతి సి.నవీన్ యాక్టివా - 110 కొన్నందుకు రిఫ్రిజిరేటర్ అందజేశారు. మూడో బహుమతి వాషింగ్ మిషన్ అంద జేశారు. బంపర్ డ్రాను మేనేజింగ్ డైరెక్టర్లు మహేంద్రారెడ్డి, నరేంద్రారెడ్డి సమక్షంలో తీశారు. కార్యక్రమంలో షోరూం జనరల్ మేనేజర్ సందీప్ కుమార్, ఏజీఎం షేక్షావలి, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

పాపిరెడ్డిపల్లెలో పిడుగుపాటు

కాశినాయన అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపిరెడ్డిపల్లెలో గురువారం రాత్రి లక్ష్మీనరసయ్య అనే రైతు ఇంటి సమీపంలో పిడుగు పడింది. దీని ప్రభావంతో ఇంటి మెట్లభాగం నెర్రెలు బారింది. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. పిడుగుపాటుకు లక్ష్మీనరసయ్య ఇంటితో పాటు సమీప గృహాల్లోని విద్యుత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు చాలా వరకు కాలిపోయాయి. వీధిలైట్లు కూడా కాలిపోయాయి.

నూతన బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్‌కు బోర్డు ఆమోదం హర్షణీయం

వేంపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ నూతన బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి రూ.2056కోట్ల అంచనాతో 110కిలోమీటర్ల మేర రైల్వే బోర్డు ఆమోదం తెలపడంపట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో కడప-రాయచోటి- మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే మార్గం మాటేమిటని ప్రశ్నించారు. శుక్రవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత రైతుల, వినియోగదారుల అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008-09 రైల్వే బడ్జెట్‌లో నాటి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కడప-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ మార్గాన్ని మంజూరు చేసిందన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

చిట్వేలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మరింత దగ్గరగా సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. సిబ్బంది సకాలంలో రాకపోవడం, వచ్చినా ఏ టైమ్‌కు వస్తారు.. ఎప్పుడు వెళతారో తెలియడంలేదని ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినపడుతున్నాయి. నిబంధనల ప్రకారం సచివాలయం సిబ్బంది ఉదయం 10.00 గంటలకు విధులకు హాజరు కావాల్సి ఉంది. అయితే మండలంలో సచివాలయ సిబ్బంది పనితీరుతో ప్రజలు అవస్థలు చెందుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉదయం 10.30 గంటల వరకు కూడా సిబ్బంది కార్యాలయాలకు రావడంలేదని వచ్చిన సమయం కాకముందే వెళిపోతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం మండల ఎంపీడీవో శ్రీనివాసులు మండల పరిధిలోని కేఎస్ అగ్రహారం సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ పరిపాలన అధికారి లేకపోవడంతో ఎంపీడీవో స్థానిక సిబ్బందిని విచారించారు. సమయం 10.30 గంటలు కావస్తున్నా ఇంతవరకు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఈ విసయమై ఎంపీడీవో శ్రీనివాసులును వివరణ కోరగా ఉదయం 10.30 గంటల సమయంలో సచివాలయంలో తనిఖీ చేశానని, అప్పటికే ముగ్గురు సిబ్బంది, మరొకరు తప్ప కార్యాలయంలో ఎవరూ లేరన్నారు. పరిపాలనాధికారి సెలవు పెట్టడం కాని, సమయానికి రాలేకపోవడం కాని ముందస్తు సమాచారం తనకు తెలపలేదన్నారు. సమయపాలన ఎవరు పాటించకపోయినా ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో హెచ్చరించారు.

సచివాలయ సిబ్బందికి మెమోలు

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని బోటుమీదపల్లె సచివాలయంలో పనిచేస్తున్న ఆరుగురు సిబ్బందికి ఎంపీడీవో విజయరావు మెమోలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎల్.రఘురామరాజు, ఏఎన్ఎం కె.అరుణకుమారి, వీఆర్వో కె.సాయి వంశీ, జీఎంఎస్‌కే టి.సావిత్రి, విలేజ్ సర్వేయర్ ఎన్.కల్యాణి, వీహెచ్ఏపై రామాంజనేయులుకు మెమోలు జారీ చేశారు.

సమయపాలన పాటించడంలేదని, ప్రజలకు కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదని వీరిపైన ఎమ్మెల్యేకి గ్రామస్థులు ఫిర్యాదు చేయగా రెండు రోజుల్లోపు వివరణ ఇవ్వాలని మెమోలు జారీ చేశారు.

పోలింగ్ కేంద్రాన్ని మార్చాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాన్ని మార్చాలని జంగిటివారిపల్లె పంచాయతీకి చెందిన కొండేటి వెంకటరమణ, కొండేటి రాజ శుక్రవారం తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 700 ఓట్లు ఉన్నాయని, ఎన్నికల పోలింగ్ బూత్‌ను రాజకీయ కారణాలతో మొలకలపోడు గ్రామానికి మార్చారని తెలిపారు.జంగిటివారిపల్లె నుంచి మొలకలపోడు గ్రామానికి వెళ్లాలంటే ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉందన్నారు. తమ గ్రామంలో కమ్యూనిటీ హాల్ సౌకర్యం ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

రాజంపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు అన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శుక్రవారం ఐఎంఏ కార్యాలయంలో జర్నలిస్టులకు రాజంపేట పట్టణంలోని ప్రముఖ వైద్యులచే హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలోని మూలస్తంభాలైన జర్నలిస్టులకు ప్రైవేటు ఆసుపత్రుల్లో తమవంతు వైద్యం అందించే సదుపాయంతో కూడిన హెల్త్‌కార్డులను తమ చేతులమీదుగా పంపిణీ చేయడం ఆనందదాయకమన్నారు. హెల్త్‌కార్డులు జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా వర్తిస్తుందని తెలిపారు. ఐఎంఏ మం డల అధ్యక్షుడు చలమయ్య, గౌరవాధ్యక్షులు, సీనియర్ డాక్టర్ చెన్నూరు సుధాకర్, డాక్టర్‌లు వీరయ్య, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి ధనశ్రీ, సభ్యులు సి.సునీల్, డి.నవీన్‌చంద్ర, ఎం.శ్రీకృష్ణ, కె.మధుసూదన్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు బచ్చేటి భాస్కర్, సీనియర్ పాత్రికేయులు అప్పారావు, జిల్లా సంయుక్త కార్యదర్శి సురేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓబులేశు, తాలుకా కోశాధికారి కార్తీక్, గణేష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నానది వద్ద పటిష్ట బందోబస్తు

సిద్దవటం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నమ్మ ఉగ్రరూపం దాల్చింది. నదిలో చేపలవేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్ రఫి శుక్రవారం లోకాజ్‌వే వద్ద మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానదిలో వరదనీరు భారీగా చేరుతోందని, జాలర్లు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశామన్నారు. లోకాజ్‌వే సమీపాన పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. హైలెవల్ వంతెన వద్ద ఎవరూ ఉండవద్దని తెలిపారు. లోతట్టు గ్రామాలైన జ్యోతి, వంతాటిపల్లె, ఆకులవీధి, గాండ్లపాళెం ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా ఇబ్బంది జరిగితే సమాచారం అందించాలని కోరారు. పెన్నా పరివాహక ప్రాంతాల్లోకి కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే సమాచారం తెలపాలన్నారు. వర్షాల వల్ల గ్రామాల్లో ఉండే కుంటలు, చెరువుల వద్దకు ఎవరూ వెళ్లవద్దని, పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని ఎస్ఐ తెలిపారు.

ఎంఈవో-1గా షేక్ ఖాజా మొహిద్దీన్

చిట్వేలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖాధికారి-1గా షేక్ ఖాజామొహిద్దిన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రాజంపేట ప్రభుత్వ హైస్కూల్లో బయాలజీ ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంఈవో కోదండనాయుడు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 ఈశ్వరయ్య, స్థానిక ఉపాధ్యాయులు ఖాజామొహిద్దిన్‌కు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు మహేష్, ఖలేషా సుబ్రమణ్యం, సీఆర్పీ రాజేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంఈవో

సిద్దవటం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న పద్మజ తిరుపతికి బదిలీ కావడంతో వల్లూరు మండలం నుంచి సిద్దవటం మండల విద్యాశాఖాధికారి-1 ఎస్.నాగరత్నమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. మెనూలో నాణ్యత లోపం ఉంటే చర్యలు తప్పవన్నారు.

'టెట్' పై ప్రభుత్వం పునఃసమీక్షించాలి'

రాయచోటిటౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్ష ద్వారా ఎంపికై సుమారు 25 సంవత్సరాల పైబడి సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు ఇప్పుడు పరీక్షలు నిర్వహించడం ఇబ్బంది గా ఉంటుందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరిపి ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించాలని నోబుల్ టీచర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు కోరారు. శుక్రవారం ఆయన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జరిగిన ఎన్టీఏ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టులో టెట్ పరీక్షపై రివ్యూ పిటిషన్ దాఖలు చేసి మనవాదనలు వినిపించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో రూటా రాష్ట్ర కన్వీనర్ షేక్. మహమ్మద్‌హాషీం, పాలెం రాజా, వెంకట్రమణ, శ్రీనివాసులు, బాలాజీ పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్ష పదవులకు పోటాపోటీ !

● అధిష్ఠానానికి నివేదిక సమర్పించిన పరిశీలకులు



టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ పరిశీలకుడు(ఫైల్)

రైల్వేకోడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్ష పదవులకు పోటాపోటీ ఏర్పడింది. గత మూడు రోజులుగా రైల్వేకోడూరు పరిశీలకులు సమావేశాలు ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను సేకరించారు. గురువారం చిట్వేలి, రైల్వేకోడూరు మండలాలలో పరిశీలకులు సమావేశాలు పెట్టి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు. నియోజకవర్గం మొత్తం జరిగిన సమావేశాల్లో చాలా మంది టీడీపీ మండల అధ్యక్ష పదవులకు పోటాపోటీగా ఉన్నారు. అభిప్రాయాలు సేకరించిన పరిశీలకులు హేమాంబరధరరావు, గిరిజకుంట శివప్రసాద్‌నాయుడు, చైతన్యలు పార్టీ అధిష్టానికి నివేదికలు పంపారు. ఐవీఆర్ కాల్స్ ద్వారా అధిష్టానం మండల పార్టీ, పట్టణ పార్టీ అధ్యక్షులను ఎంపిక చేయనుంది. రైల్వేకోడూరు మండలంలో మండల పార్టీ పదవికి శేఖర్‌రాజు, పట్టణ అధ్యక్షుడుగా పోకల మణి, నార్జాల హేమరాజ్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

పుల్లంపేట మండలంలో చంద్రశేఖర్‌నాయుడు తదితరులు, చిట్వేలి మండలంలో గుత్తి నరసింహ, నాగార్జున నాయుడు, ఓబులవారిపల్లె మండలంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఒక్క ఓబులవారిపల్లె మండలం మినహా తక్కిన మండలాల్లో పోటాపోటీగా ఉన్నారు. టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి టీడీపీ మండల అధ్యక్ష పదవుల ఎంపికలో సమన్వయంతో వ్యవహరిస్తున్నారు. ఈ పదవులు ఎవరిని వరిస్తాయో వేచి చూడాల్సిందే.

పేరుకు మాత్రమే రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్

రాయచోటిటౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రాయచోటికి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా పేరుకు మాత్రమే ఉందని కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికే డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్థంభించి మహమ్మద్‌పురావీధి, కొత్తపల్లి ప్రాంతాల్లో ఇళ్లలోకి డ్రైనేజీ నీరు వస్తోంద న్నారు. డ్రైనేజీ వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అలాగే రాయచోటి - పించా రహదారిన ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

రైల్వేకోడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం అని జనసేన పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట, ఎస్. ఉప్పరపల్లె గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. డీసీఎంస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, కోడూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, కూటమి నాయకులు ఆకేపాటి సుకుమార్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

వార్డు సభ్యుడు మృతి

పెనగలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు పంచాయతీలోని కొత్తపల్లెలో గల రెండో వార్డు మెంబరు దాసరి సుబ్బరాయుడు(70) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందినట్లు ఆ యన కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహానికి పెనగలూరు-1 ఎంపీటీసీ చాపల అను రాధమ్మ, సుబ్బారెడ్డి దంపతులు నివాళులర్పించారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విష మించడంతో మృతిచెందినట్లు వారు తెలిపారు.

అనాథ పిల్లలకు నిత్యావసరాల పంపిణీ సంతోషకరం

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అనాథ పిల్లలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం సంతోషించదగ్గ విషయమని విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రాయచోటిలోని మదరసాలో ఉన్న అనాథ పిల్లలకు రూ.30 వేలు విలువ జేసే సరుకులను అందజేశారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన ముక్కా



వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ముక్కా

రైల్వేకోడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరద ప్రాంతాలను శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పరిశీలించారు. మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలోని గుర్రప్పపాళెం గిరిజ గ్రామం వద్ద వరద ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు ఎక్కడా నష్టం జరగలేదన్నారు. వరద నీటిని పక్కకు మళ్లించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రక్షణగోడ, గుర్రపాళెం లోలెవల్ బ్రిడ్జి పనులకు ఆటంకం లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగిరెడ్డి, కోడూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, కూటమి నాయకులు నార్జాల హేమరాజ్, పోకల మణి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలోకి వర్షపునీరు



వినాయకనగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో వాన నీటిలో తడిచిన వస్తువులు, ఇతర సామగ్రి

పెనగలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు పంచాయతీ పరిధిలోని వినాయకనగర్‌లో గల ఇండ్లూరు-3 అంగన్వాడీ కేంద్రంలోకి మోకాటి లోతు వర్షపునీరు చేరడంతో వస్తువులు, వంట సామగ్రి పాడైపోయాయి. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అంగన్వాడీ కేంద్రంలోకి నీరు చేరాయి. శుక్రవారం ఉదయాన్నే కేంద్రానికి వచ్చిన కార్యకర్తలు ప్రసన్న నారాయణమ్మ పరిస్థితిని గమనించి వెంటనే సూపర్‌వైజర్ విజయకుమారికి తెలియజేశారు. వెంటనే సూపర్‌వైజర్ ఉన్న తాధికారులకు నివేదికను అందించారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



ద్వారకనాథరెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

రాజంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర బార్ కౌన్సెలింగ్ అధ్యక్షుడు ఎన్.ద్వారకనాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బార్ కౌన్సెలింగ్ కార్యాలయంలో రాజంపేట బార్ కౌన్సెలింగ్ అధ్యక్షుడు హనుమంతనాయుడు ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బార్ కౌన్సెలింగ్ రిలీఫ్ ఫండ్ రూ.4 లక్షలుగా ఉండేదని నేడు రూ.9 లక్షలు చేశామన్నారు. న్యాయవాదులు గురు ప్రతాప్‌రెడ్డి, టి.లక్ష్మీనారాయణ, సింగంశెట్టి కృష్ణకుమార్, టి.రఘునాథరెడ్డి, గోవర్ధన్, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించాలి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు గైర్హాజరు అయిన విద్యార్థుల కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని సమగ్ర శిక్ష ఆల్టర్నేటర్ స్కూల్ కో ఆర్డినేటర్ ఉలవల వెంకట్రామయ్య అన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలోని బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మండల విద్యాశాఖ అధికారి చక్రేనాయక్, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రాయచోటిటౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురిసిన వర్షాలకు అన్నమయ్య జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం రాయచోటి ఏరియా అధ్యక్షుడు హరినాథనాయుడితో కలిసి మీడియాతో మాట్లాడారు.

దేవపట్ల సహకార సొసైటీ బ్యాంకుకు తాళం

● జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్న చైర్మన్

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): దేవపట్ల సహకార సొసైటీ బ్యాంక్ విధులకు రాకుండా తాళం వేయడంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆ శాఖ చైర్మన్ మల్లూరు కోటేశ్వర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన బ్యాంకుకు వెళ్లగా బ్యాంకుకు తాళం వేసి ఉందన్నారు. ఎన్నిమార్లు చెప్పినా సిబ్బంది సహకరించకపోవడంతో ఖాతాదారులకు బ్యాంకు సేవలు సక్రమంగా అందడం లేదని ఆయన పేర్కొన్నారు.

సీఈవో ఏమన్నారంటే...

దేవపట్ల సహకార బ్యాంక్ సొసైటీ సీఈవో అన్వర్‌ను వివరణ కోరగా తాను బ్యాంక్ కలెక్షన్ డబ్బు కట్టేందుకు రాయచోటి డీసీసీబీ బ్యాంకుకు వెళ్లినట్లు తెలిపారు. మరో ఇరువురు సిబ్బంది కంప్యూటర్ వర్క్ విషయంపై మేనేజర్ ఆదేశాలతో బ్యాంకుకు వెళ్లినట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరించాలి

రాయచోటిటౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బీ. వెంకటమోహన్ పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణంలోని సుద్దలవాండ్లపల్లె రోడ్డులో గల ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీ సీఎన్ ఎఫ్) ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని ఎన్‌యంటీ ఫీల్డ్ లెవెల్ మాస్టర్ ట్రైనర్‌లకు శిక్షణ ఇచ్చారు.

పెట్టుబడులకు కల్పవృక్షం ఆంధ్రప్రదేశ్

నందలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు కల్పవృక్షం అని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు యెద్దల విజయ సాగర్ అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నవంబరు 14న విశాఖపట్టణంలో నిర్వహించనున్న సమ్మిట్‌కు పెట్టుబడిదారులకు అవేర్నెస్ కార్యక్రమానికి సంబంధించి ముఖ్యమంత్రి దుబాయ్(యూఏఈ)లో పర్యటిస్తున్నారన్నారు. తాను కూడా అక్కడ కొన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రాష్ట్రానికి ప్రపంచంలో మంచి గుర్తింపు, భవిష్యత్ ఉండాలని ఆకాంక్షిస్తున్నారన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

నందలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆధార్ సేవలను వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి అనంతకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ కోరారు. శుక్రవారం నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో ఆధార్ సేవలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈనెల 27 నుంచి 30 వరకు మెయిన్ ఉన్నత పాఠశాలలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

నేడు సమావేశం

రైల్వేకోడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు అన్ని పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎన్నికల డీటీ గల్లా రమణ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చిస్తామన్నారు.

మంత్రిని కలిసిన జనసేన నేతలు



మంత్రి నాదెండ్లను సత్కరిస్తున్న కోడూరు జనసేన నాయకులు

రైల్వేకోడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మంత్రి నాదెండ్ల మనోహర్‌ను రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జోన్ కన్వీనర్లు జోగినేని మణి, పగడాల వెంకటేష్, నాయకులు పగడాల చంద్రశేఖర్, ఆలం రమేష్, మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త తదితరులు కలిశారు.

అధికలోడుతో వెళితే చర్యలు

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం కోడూరు పట్టణంలో వాహనాలను పరిశీలించారు.అవసరమైన పత్రాలు లేకుండా వాహనాలను నడపడం నేరమన్నారు.

అమ్మో.. రోడ్డు..!

పట్టణంలోని రోడ్లు నరకానికి నకళ్లుగా మారడంతో వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా లేనివారి ప్రాణాలు గాలిలో కలసి పోతున్నాయి. దీంతో ఈ రోడ్డుపై వెళ్లేందుకు ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.



శివాలయం వద్ద దెబ్బతిన్న రోడ్డు..

సిమెంటు రోడ్డుపై తారు వేసినా ఏర్పడిన గుంతలు

ఇద్దరి ప్రాణాలు బలి తీసుకున్న యూటర్న్ ఇదే..

రైల్వేకోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు దశాబ్దాల క్రితం రైల్వేకోడూరు పట్టణంలోని ఆర్టీసీ అప్రోచ్ రోడ్డు నుంచి వెంకయ్య స్వామి ఆలయం వరకు ప్రధాన రోడ్డును విస్తరించడంతోపాటు, సిమెంటు రోడ్డు, మధ్యలో డివైడర్ కూడా ఏర్పాటు చేశారు. అయితే, పనులు నాసిరకంగా చేయడంతో పూర్తైన కొంత కాలానికే అవి దెబ్బతినడం ప్రారంభించాయి. వాటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్న విషయాన్ని అధికారులతోపాటు, నాయకులూ పట్టించుకోకపోవడంతో చీలికలు పెద్దవై గోతులుగా మారాయి. ఈ విషయం గమనించకుండా వెళ్లే ద్విచక్ర వాహనదారులందరూ ప్రమాదంబారిన పడి గాయాలపాలయ్యారు.

వర్షం కురిసినప్పుడు ఈ ప్రమాదాల సంఖ్య మరీ అధికంగా ఉంటుంది. ఈ గోతుల కారణంగా అదుపు తప్పి పడిపోయిన ద్విచక్ర వాహనదారులు అదే మార్గంలో వేగంగా వెళుతున్న లారీల కింద పడి మృతి చెందిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇటీవల పట్టణంలోని రంగనాయకులపేటకు చెందిన బొక్కసం మహేంద్ర అనే యువకుడు నడుపుతున్న బైక్ యాక్సిస్ బ్యాంకు సమీపంలోని రోడ్డుపై ఉన్న గుంత కారణంగా అదుపుతప్పి కింద పడగా, వెనుక నుంచి వస్తున్న లారీ అతనిమీదుగా వెళ్లి పోయింది. పట్టణంలోని బలిజ వీధికి చెందిన నరేంద్ర అనే ఆర్ఎంపీని యూటర్న్ తీసుకునే క్రమంలో వేగంగా వచ్చిన ఓ ప్రైవేటు అంబులెన్సు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలా ఈ ఏడాది వ్యవధిలో ఈ రోడ్డుపై ప్రమాదాల కారణంగా పది మంది మృతి చెందారు. సుమారు 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఆర్టీసీ అప్రోచ్ రోడ్డు నుంచి తుల సీ స్కూలు వరకు, హోండా షోరూం, టీవీఎస్ షోరూం, లక్ష్మీపార్వడైజ్ సినిమా హాలు, సుజుకీ షోరూం, యాక్సిస్ బ్యాంకు ఎదురుగా, శివాలయం తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్డుకు ఈ మధ్య కాలంలోనే మరమ్మతులు చేసినా ఫలితం లేకుండా పోతోంది. పట్టణంలోని హీరో షోరూం ఎదురుగా ఏర్పాటు చేసిన యూటర్న్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు కూడా.

వాహనాల రద్దీతోనే..

పట్టణంతోపాటు చుట్టుపక్కల మండలాల్లో అరటి, బొప్పాయి తదితర ఉద్యాన పంటలు ఎక్కువగా సాగవుతాయి. పట్టణానికి పక్కనే ఉన్న మంగంపేట గ్రామం వద్ద బెరైటీస్ గనులు ఉన్నాయి. ఇక అతి సమీపంలోనే తిరుమల క్షేత్రం ఉంది. సమీపంలోనే చెన్నై హార్బరు కూడా ఉంది. ఈ నేపథ్యంలో కార్లు వంటి చిన్న వాహనాలతో పాటు, వందలాది టన్నుల బరువైన యంత్రాలను తరలించే భారీ వాహనాలు సైతం ప్రతి రోజూ పెద్ద ఎత్తున రైల్వే కోడూరు పట్టణంలోని రోడ్డు మీదుగానే ప్రయాణిస్తుంటాయి. ఈ వాహనాల ఒత్తిడి కారణంగానే రోడ్డు దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, బైపాస్ రోడ్డు నిర్మించి పట్టణంలో వాహనాల రద్దీని తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

బైపాస్ రోడ్డు లేకనే ప్రమాదాలు



పెద్ద, పెద్ద వాహనాలు వెళుతుండడంతో రోడ్డులో గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.ఎంత అప్రమత్తంగా ఉన్నా ప్రమాదాలు జరుతుగూనే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతలు పూడ్చడంతోపాటు, బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

\- మందల సుబ్రహ్మణ్యం, రైల్వే కోడూరు

ప్రమాదాలను అరికట్టాలి



ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి, ద్విచక్ర వాహనదారులు చనిపోతూనే ఉన్నారు. రోడ్లు గత ప్రభుత్వంలో ఎలా ఉన్నాయో.. ప్రస్తుతం కూడా అలాగే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని రోడ్లను బాగు చేయాలి.

\- మోతీలాల్, రైల్వే కోడూరు

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం

● ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి విద్యాసాగర్

రాయచోటి టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఆలపాటి విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నేతాజీ సర్కిల్ మీదుగా బస్టాండు వరకు ఉద్యోగులు, పెన్షనర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 13 జిల్లాలకే పరిమితమైన ఏపీ ఎన్జీవో సంఘం కమిటీలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లాలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగ సంఘాలను పిలిపించి డీఏ, హెల్త్ కార్డులు, ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇన్సూరెన్స్ ఉద్యోగినులకు చైల్డ్ కేర్ లీవ్ వాడుకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. మూడేళ్లుగా ప్రమోషన్లు లేక ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు కల్పించాలని రాష్ట్ర యంత్రాంగానికి, చీఫ్ సెక్రటరీకి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గత ఆరేళ్లుగా ఉద్యోగులు చీకటి యుగంలో మగ్గారని తెలిపారు. గత ప్రభుత్వం 3600 మందిపై కేసులు బనాయించిందన్నారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.32,500 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు తొలగించిన 950 మంది ఎంపీహెచ్ఏలకు న్యాయం చేయాలని కోరామన్నారు. ఏపీఎన్జీవో సంఘ కమిటీలను గ్రామ స్థాయిలో సైతం ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, రాష్ట్ర కార్యదర్శి శివప్రసాద్, ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి నిత్య పూజయ్య, అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవులు, రమేశ్, తిరుపతి అధ్యక్షుడు సురేశ్, కడప తాలూకా అధ్యక్షుడు చిన్నయ్య, కోశాధికారి నాగార్జున, ఉపాధ్యక్షుడు రాజగోపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరారెడ్డి, జాయింట్ సెక్రటరీ మోహన్‌రెడ్డి, రాయచోటి ఎన్జీవో సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి మహదేవ, కోశాధికారి దేవేంద్ర, ఉమెన్ వింగ్ చైర్మెన్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో బీహార్ జడ్జి

బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అరుణ్‌కుమార్ జహ శుక్రవారం హార్సిలీహిల్స్‌కు విచ్చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు అధికారులు గవర్నర్ బంగ్లాలో విడిది ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ మేరకు తహసీల్దార్ బావాజాన్, బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి స్వాగతం పలికారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ములకలచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కాలువపల్లె పంచాయతీ బుద్దలవారిపల్లెకు చెందిన మంచినీళ్ల నరసింహులు(64), మద్యం తాగేందుకు భార్య డబ్బులివ్వలేదన్న కోపంతో ఈ నెల 7 న గడ్డి మందు తాగాడు. తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య కదిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

హోటళ్లలో 'ఆహార భద్రత' తనిఖీలు



ఓ హోటల్ వంటశాలలో తనిఖీలు చేస్తున్న ఆహార భద్రత అధికారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా అధికారులు, మున్సిపల్ అధికారులతో కలసి తనిఖీలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా ఆహార భద్రతా అధికారి కేఎస్ బాషా ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని గోంగూర, సంతృప్తి, ఆంధ్ర స్పైస్, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పిట్టాస్ బావార్చి, రెడ్ బకెట్ బిరియాని, కేఎఫ్‌సీ తదితర హోటళ్లలో, బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంట గదులతో పాటు, ఆహారం వడ్డించే ప్రదేశాల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. కొన్ని హోటళ్లలో అపరిశుభ్రంగా ఉండటంతో నోటీసులు జారీ చేసినట్లు కేఎస్ బాషా తెలిపారు. మిగిలిన హోటళ్ల నిర్వాహకులకు తగు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.

ఘాట్ రోడ్డులో నేలకొరిగిన వృక్షం

బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హార్సిలీ హిల్స్ ఘాట్ రోడ్డులోని నాలుగో మలుపు వద్ద శుక్రవారం ఓ భారీ వృక్షం నేలకొరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో కొండ చరియల్లోంచి వస్తున్న నీరు ఘాట్ రోడుపై ప్రవహిస్తోంది. ఈ ప్రవాహం కారణంగా వృక్షాలు కూలిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చెట్టు కొమ్మలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

అనాథ మృతదేహం చెంగల్రాయులుగా గుర్తింపు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం సమీపంలో గురువారం రాత్రి మృతి చెందిన వ్యక్తి పలమనేరు మండలం, గంగవరం, పాతూరుకు చెందిన చెంగల్రాయులు (64)గా గుర్తించారు. ఆయన కుటుంబసభ్యులు శుక్రవారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు. వారి కథనం మేరకు తంబళ్లపల్లె మండలం, కోసువారిపల్లెలో ఉన్న కూతురు భారతి ఇంటికి వెళుతున్నట్లు చెప్పి ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిన చెంగల్రాయులు కూతురి ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో సీటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందడంతో ఆయన భార్య కాంతమ్మ ఆస్పత్రికి చేరుకుని మృతి చెందినది తన భర్తేనని గుర్తించారు.

'మద్యం కేసు నిందితుడు మాజీ సైనికుడు కాదు..!'

మదనపల్లె టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ పోలీసులకు బుధవారం మద్యంతో పట్టుబడింది మాజీ సైనికుడు కాదని మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్దకు వచ్చిన ఆయన మాట్లాడుతూ 41 సీసాల మద్యంతో పట్టుబడిన రమేశ్ అనే వ్యక్తి మాజీ సైనికుడు కాదని, అసలు తమ డివిజన్‌లో అతని పేరు నమోదు కాలేదన్నారు. ప్రజలను అధికారులను తప్పుదోవ పట్టించేందుకు ఇలా చెప్పి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

వరి పొలాలపై అడవిపందుల దాడి

సుండుపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరి మళ్లలో పందుల స్వైరవిహారంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం రాత్రి కటారు ముడుకుకు చెందిన నరసప్పనాయుడు, మద్దిలేటి నాయుడు, అయ్యలవారిపల్లెకు చెందిన సుబ్బరాములతో పాటు మరికొంత మంది రైతుల పొలాల్లో అడవి పందులు దాడి చేసి నష్టపరిచాయి. శుక్రవారం వ్యవసాయశాఖ సిబ్బంది రాధమ్మ ఆయా పొలాలను పరిశీలించారు.ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు. నష్టనివారణ కోసం ప్రభుత్వానికి మంజూరు చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



పీలేరు: డివైడర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

ములకలచెరువు, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పాత ములకలచెరువు పంచాయతీ దుగుసానివారిపల్లెకు చెందిన ఆంజనేయులు కుమారుడు అనిల్ కుమార్(28), సత్యసాయి జిల్లా తనకల్లు మండలం బొంతలపల్లెకు చెందిన సునీల్(24)తో కలసి గురువారం రాత్రి ద్విచక్ర వాహనంలో ములకలచెరువుకు వస్తుండగా ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలోని ఇరానీ చాయ్ దుకాణం వద్ద వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సునీల్‌ను మదనపల్లెలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సోనియా, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

వాల్మీకిపురం : పీలేరు పట్టణంలోని పద్మావతి నగర్‌కు చెందిన ఎస్.సయ్యద్ బాషా(45) ట్రాక్టర్ ఇంజన్‌తో వాల్మీకిపురం మండలం చెరుకువారిపల్లె సమీపంలో రాంగ్ రూట్‌లో వెళుతుండగా చెన్నైకి వెళుతున్న బొలెరో వాహనం ఎదురుగా వచ్చింది. రెండు వాహనాల డ్రైవర్లూ వాహనాలను అదుపు చేయలేకపోవడంతో డివైడర్‌ను ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సయ్యద్‌బాషా, బొలెరో వాహనంలోని శ్రీనివాసమూర్తి, శివశంకర్ రెడ్డిలను పీలేరు ఆస్పత్రికి తరలించారు. సయ్యద్‌బాషా పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్టు

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్ర చందనం అక్రమ రవాణా కేసుల్లో కడప జిల్లా చాపాడు మండలం ఖాదర్‌పల్లెకు చెందిన చీంపర్తి ఫక్రుద్దీన్ (గోరేసాబ్ ఫక్రుద్దీన్/పొంగోడు) ను పీడీ యాక్టు కింద నిర్బంధించడాన్ని నిర్ధారిస్తూ ప్రభుత్వం శుక్ర వారం ఆదేశాలు జారీ చేసింది. ఎర్రచందనం స్మగ్లర్ ఫక్రుద్దీన్‌ను పీడీ యాక్టు కింద నిర్బంధించాలని గత నెల 2న కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే అతనిపై 8 వేర్వేరు రకాల కేసులుండగా, గతంలో పీడీ యాక్టు కింద ఒకసారి నిర్బంధించినా, విడుదలయిన తర్వాత అక్రమ రవాణా కార్యకలాపాలను కొనసాగించాడని, అతనిని పీడీ యాక్టు కింద నిర్బంధించడం వినా మార్గం లేదని కలెక్టరు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను గత నెల 11న ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్బంధించిన అనంతరం మూడు వారాల్లోగా పీడీ యాక్టు కింద ఏర్పాటయిన రాష్ట్ర న్యాయ సలహా బోర్డు విచారించి నిర్బంధాన్ని సమర్థించాల్సి ఉంది. ఈ మేరకు సెప్టెంబరు 26న ముగ్గురు సభ్యులతో కూడిన సలహా బోర్డు ఫక్రుద్దీన్‌తోపాటు, విచారణాధికారిని వీడియో కాన్ఫరెన్సు ద్వారా విచారణ చేసింది. అతనిని నిర్బంధించడానికి కారణాలను, ఆధారాలను పరిశీలించిన సలహా బోర్డు.. కలెక్టరు చర్యలను, ప్రభుత్వం ఆమోదాన్ని సమర్థిస్తూ నివేదిక అందజేసింది. దీంతో ఈ ఏడాది సెప్టెంబరు 5 నుంచి 12 నెలలపాటు పీడీ యాక్టు కింద నిర్బంధించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

లీజు గడువు ముగిసినా.. కొనసాగుతున్నారు

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దచెరువు లీజు గడువు ముగిసినా ఇప్పటికీ గత వేలం దారులే కొనసాగుతున్నారని పోతుపేట పంచాయతీ పిడుంవారిపల్లె గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా పెద్ద చెరువులో చేపలు పట్టుకునే హక్కులు దక్కించుకున్నవారు.. గడువు ముగిసినా ఇప్పటికీ కొనసాగుతున్నారని ఆరోపించారు. చెరువులోకి తమ గ్రామస్తులను రానివ్వకపోగా.. కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు దీనిపై పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

పిడుగుపాటు బాధిత కుటుంబానికి పరిహారం

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేవీ పల్లె మండలం నూతనకాల్వ పంచాయతీ నడింపల్లెకు చెందిన పిడుగుపాటు బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కుటుంబానికి చెందిన జోతా నాగరాజు గత ఏడాది అక్టోబరు 20న పిడుగుపాటుకు గురై మరణించగా బాధిత కుటుంబానికి పరిహారంకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. బాధిత కుటుంబానికి పరిహారం సొమ్మును వెంటనే చెల్లించాలని కలెక్టరును రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హౌస్‌బిల్డింగ్ సొసైటీ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవమైన కమిటీ సభ్యులతో అఫిషియల్ పీఐసీ ప్రవీణ్‌కుమార్

మదనపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో- ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీమయ్యాయి. ఇందులో ఒకే ప్యానల్ నుంచి ఎనిమిది మంది సభ్యులు నామినేషన్లుదాఖలు చేశారు. శుక్ర వారం నామినేషన్ల ఉపసంహరణలో ఒక అభ్యర్థి పోటీ నుంచి తప్పుకోవడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సొసైటీ కాలనీలోని సహకారశాఖ డివిజన్ కార్యాలయంలో ఎన్నికైన సభ్యులకు డిక్లరేషన్ పత్రాలు అందజేశారు. ఏకగ్రీవమైన సభ్యులు బి.మహేశ్‌కుమార్, ఎన్.రెడ్డెప్ప, కె.వీరవెంకటశివాజీ, బి.శివానంద నాయక్, కె.వెంకటాచలపతి, ఎస్.రెడ్డిషామీర్, యు. నరేష్ ఉన్నారు. శనివారం ఉదయం 10:30గంటలకు స్థానిక కార్యాలయంలో మదనపల్లె హౌసబిల్డింగ్ సొసైటీ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఎన్నికల జరగనున్నట్లు ఎన్నికల అధికారి రాజశేఖర్‌రెడ్డి, అఫీషియల్ పీఐసీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇందులో రెండో వర్గం వివిధ కారణాలు చూపుతూ ఎన్నికలు ఆపేందుకు న్యాయస్థానానికి వెళ్లినట్లు చెబుతున్నారు.

'గుమ్మసముద్రం'తో రాకపోకలకు అంతరాయం



రోడ్డుపై ప్రవహిస్తున్న గుమ్మసముద్రం మొరవనీరు

బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మసముద్రం చెరువుకు రెండు వైపులా మొరవలున్నాయి. ప్రస్తుతం చెరువు నిండడంతో రెండు రోజులుగా కుడివైపు మొరవ నుంచి నీటిని వదిలారు. ఎడమ వైపు నుంచి నీరు విడుదలైతే హంద్రీనీవా కాల్వలోకి చేరి కాల్వ దెబ్బతింటుందన్న ఉద్దేశంలో అధికారులు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వరద ఉధృతి పెరగడంతో నీరు మదనపల్లె బి.కొత్తకోట రహదారిపై ప్రవహించింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. తహసీల్దార్ బావాజాన్ చెరువు వద్దకు చేరుకుని హంద్రీనీవా అధికారులతో మాట్లాడారు. గత్యంతరం లేని పరిస్థితిలో ఎడమవైపు మొరవపై వేసిన ఇసుక బస్తాలను తొలగించి రెండు వైపులా నీటిని విడుదల చేశారు. దీంతో రాకపోకలు కొనసాగాయి. హంద్రీనీవా కాల్వలోకి నేరుగా మొరవ నీరు వస్తుండడంతో అధికారులు కాల్వ తెగిపోకుండా తగుజాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాగా మొరవ నీటిని, చెరువు అందాలను చూసేందుకు బి.కొత్తకోట పట్టణ వాసులు సహా చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం గుమ్మసముద్రం చెరువు వద్దకు వస్తున్నారు.

చెరువులు, కుంటల పరిశీలన



మర్రిఒడ్డు చెరువు తూములను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారుల

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా మండలంలోని చెరువులు కుంటలను శుక్రవారం ఇరిగేషన్ డీఈ చెన్న కేశవరెడ్డి, జేఈ సతీష్‌గౌడ్ పరిశీలించారు. ఇందులో భాగంగా టి.సదుం పంచాయతీ తుమ్మల చెరువుకట్ట రెండు మూడు చోట్ల ప్రమాదకరంగా మారినట్లు గుర్తించారు. మల్లెల గ్రామ సమీపంలో ఉన్న మర్రిఒడ్డు చెరువు మొరవ పోతుండడంతోపాటు, తూముల నుంచి నీరు వృథాగా పోతుండ దంతో గ్రామస్తుల సహకారంతో ఇసుక మూటలు వేయించి కట్టడి చేశారు. ఎక్కడైనా చెరువులు కుంటలు ప్రమాదకరంగా అనిపిస్తే వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు అందు బాటులో ఉండి ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేయాలని వీఆర్వోలు, వీఆర్ఏలకు ఆదేశించారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఏపీఓ ఢిల్లీ బాబు, మల్లెల సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, వీఆర్వో శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి నాగరాణి, మల్లెల సీనియర్ టీడీపీ నేత కుందిలి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన బేస్‌బాల్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేశ్, పీడీ సోమశేఖర్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన పోరుమామిళ్లలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అరవింద్, ఓంప్రసన్న విజేతలుగా నిలిచారు. వీరు నవంబరు 8, 9 తేదీల్లో రైల్వేకోడూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్-17 విభాగంలో డీ. చందన విజయం సాధించి ప్రకాశం జిల్లాలో జరగబోవు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలకు మదనపల్లె విద్యార్థిని



శరణ్య

మదనపల్లె టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మదనపల్లె విద్యార్థిని శరణ్య ఎంపికైందని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్‌పర్సన్ అమృత తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో ఈ నెల 23న నిర్వహించిన అండర్-17 బాలికల విభాగం బాడ్మింటన్ పోటీల్లో పి.శరణ్య పాల్గొనిం దన్నారు. ఆమె ప్రతిభ మెచ్చిన సెలెక్టర్లు నవంబర్ నెలలో రాష్ట్ర స్థాయి పోటీలకు చిత్తూరు జిల్లా జట్టు తరపున పాల్గొనేందుకు ఎంపిక చేశారన్నారు. శరణ్యను రెండో చైర్‌పర్సన్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ షెహనాజ్, పీఈటీలు అభినందించారు.

గురుకుల విద్యార్థినికి సూపర్ జీఎస్టీ అవార్డు



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సోమశేఖర్

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కలికిరి జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల పదవ తరగతి విద్యార్థిని కె.ఖ్యాతి రాష్ట్ర స్థాయి సూపర్ జీఎస్టీ అవార్డు కైవసం చేసుకుంది. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ 2.0పై ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అవార్డుకు ఎంపికయ్యింది. గత వారం కర్నూలులో సూపర్ జీఎస్టీపై జరిగిన సమావేశంలో ప్రధాన మంత్రి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవాల్సి ఉండగా, షెడ్యూల్‌లో మార్పుల కారణంగా అవార్డు ప్రదానం వాయిదా పడింది. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల నుంచి ఎంపికయిన 17 మంది అవార్డు విజేతలను అభినందించారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయంలో అవార్డులు అందజేశారు. దీంతోపాటు గురువారం కలెక్టరు ప్రశంసా పత్రం, జ్ఞాపిక, రూ.ఐదు వేల నగదు అందజేశారు. శుక్రవారం విద్యార్థినిని ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

మదనపల్లె అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):స్థానిక బీటీ కళాశాల మైదానంలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా హ్యాండ్‌బాల్ బాల బాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు నాగరాజ, ఝాన్సీరాణి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 15 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన జట్లు గుంటూరులో బాలికల చాంపియన్‌షిప్, ఎన్టీఆర్ జిల్లాలో బాలుర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. శివ, క్రీస్తే, సంధ్య, ప్రసాద్, నరేష్‌బాబు, దిలీప్, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్, కిరణ్, రెడ్డివరప్రసాద్, మహేంద్ర, బాలజీ, తదితరులు పాల్గొన్నారు.

సురక్షయాప్‌తో నకిలీ, కల్తీ మద్యానికి చెక్

- కొన్నచోటే వినియోగదారుడు పరిశీలించవచ్చు
- స్కాన్‌చేయగానే బాటిల్ చరిత్ర ప్రత్యక్షం

బద్వేలుటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన మద్యం వినియోగదారుడికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మద్యం కొన్న వెంటనే దుకాణం వద్దే చెక్‌చేసుకునేందుకు వీలు కల్పించింది. ఈ క్రమంలోనే ఓ సరికొత్త యాప్‌ను తీసుకువచ్చింది. దీని ద్వారా వినియోగదారుడు తానుకొనే మద్యం అసలైందా లేక నకిలీ మద్యమా అనే విషయం అక్కడికక్కడే తెలిసిపోతుంది. సురక్షయాప్ ద్వారా స్కాన్‌చేస్తే చాలు తాను కొన్న లిక్కర్‌బాటిల్ సంస్థ వివరాలు కస్టమర్స్‌కు కన్పించేలా ఈ యాప్‌ను రూపొందించారు. లిక్కర్ ధర.. ఎక్కడ తయారైంది.. ఏ బ్రాండ్.. ఏ డిపోనుంచి సప్లై చేశారు.. ఇలా అన్ని వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. ఇది ఏపీ ఎక్సైజ్ సురక్షయాప్. ఈ యాప్ ద్వారా అటు కష్టమర్లు తాము తాగేలిక్కర్ నాణ్యతను తెలుసుకునేందుకు, రీటేల్ దుకాణదారుడు అమ్మకాలు తెలుసుకోవడానికి ప్రభుత్వం దీన్ని తీసుకువచ్చింది.



సురక్షయాప్ ద్వారా లిక్కర్ బాటిల్‌ను స్కాన్‌చేసి పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సురక్షయాప్‌ను సులభంగా వాడవచ్చు

ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఎవరైనా సులభంగా వాడవచ్చు. కష్టమర్లు, ఆన్డ్రాయిడ్ సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఇన్‌స్టాల్ కాగానే కష్టమర్స్ రీటైల్ ఆప్షన్ చూపుతుంది. కష్టమర్ ఆప్షన్‌ను ఎంపిక చేయాలి. తరువాత కష్టమర్స్ తాము కొనుగోలు చేసే లిక్కర్ బాటిల్‌పై ఉన్న స్టిక్కర్(హలోగ్రాఫ్)ను యాప్‌లోని స్కానర్ ద్వారా స్కాన్‌చేసి కింద సెక్యూరిటీ కోడ్‌ను ఎంపిక చేయగానే ఆ బాటిల్ వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. ముఖ్యంగా ఆ మద్యం బ్రాండ్‌పేరు, ఆ బాటిల్ ఎంఎల్ సైజు, బ్యాచ్ ఐడీ, ఎమ్మార్పీ, తయారు చేసిన కంపెనీ వివరాలు, తేదీ, సమయం, అది ఏ లిక్కర్ డిపో నుంచి సప్లయ్ చేశారు వంటి వివరాలు క్షణాల్లో తెలిసిపోతాయి. ఒకవేళ స్కాన్ చేసిన వివరాలు నాట్‌ఫౌండ్ లేదా ఇన్‌వాలిడ్‌స్టాక్ అని వస్తే అది నకిలీ మద్యంగా భావించవచ్చు. కస్టమర్స్ ఫిర్యాదు చేయకుండానే ఆ వివరాలు ఎక్సైజ్‌శాఖ దృష్టికి వస్తాయి. ఈ సురక్షయాప్ వల్ల కష్టమర్స్ నకిలీ మద్యం బారి నుంచి కాపాడుకునేందుకు వీలు ఉంటుంది.


మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఎక్సైజ్ సురక్ష మొబైల్‌యాప్ ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మద్యం దుకాణాలు, బార్లల్లో నకిలీ మద్యం అమ్ముతున్నారనే వదంతులను ఎవరూ నమ్మవద్దు. కొందరు పనికట్టుకొని చెడుప్రచారం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రత్యేకంగా తీసుకువచ్చింది. దీనిని మొబైల్ ద్వారా వినియోగించుకోవచ్చు.

-ఎం.జయరాజ్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషన్ అధికారి

సీబీఆర్‌కు భారీగా వరద నీరు

లింగాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సీబీఆర్‌కు భారీగా వరదనీరు చేరుతోంది. శుక్రవారం ఉదయానికి 500 క్యూసెక్కులతో ప్రారంభమైన వరద క్రమేపి 2500 క్యూసెక్కులకు పెరగడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఇప్పటికే ప్రాజెక్టులో 9టీఎంసీల వరకు నీరు ఉండటంతో వరద మరింత పెరిగితే చిత్రావతి నదిలోకి నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే సాయంత్రం వరద 1100 క్యూసెక్కులకు పడిపోవడంతో నదికి నీటి విడుదల వాయిదా వేశారు. ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం పది టీఎంసీలు. ఆర్డీఓ చిన్నయ్య, డిప్యూటీ తహసీల్దార్ నరేంద్ర, ఎస్‌ఐ అనిల్‌కు మార్ ప్రాజెక్టును పరిశీలించి నది పరివాహక ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా నదిలోకి నీటి విడుదల నిర్ణయం తీసు కుంటామని పీబీసీ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.



సీబీఆర్ ప్రాజెక్టులో నీటి నిల్వ

ఎల్ఎస్‌పీ డ్యాంకు....

బి.కోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోయరు సగి లేరు ప్రాజెక్టు (ఎల్ఎస్‌పీ)కు నాలుగురోజుల నుంచి ఎగువన భారీగా కురుస్తున్న వర్షాలకు అధికంగా నీరు వచ్చి చేరుతుంది. దీంతో శుక్రవారం ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి 1700 క్యూసెక్కులు దిగువకు సగిలేటికి వదలగా 250 క్యూసెక్కుల నీటిని బద్వేలు పెద్ద చెరువుకు విడుదల చేశామని తెలిపారు. వరద పెరిగితే దిగువకు నీటి విడుదల పెంచుతామని, సగిలేటికి ఇరువైపులా ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



డ్యాం నుంచి నీటి విడుదల

ఉధృతంగా సగిలేరుకు...

కలసపాడు,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎగువన గిద్దలూరు ప్రాంతంలోని నల్లమల అడవుల్లో నాలుగురోజుల పాటు కురిసిన వర్షాలతో సగిలేరుకు ఉధృతంగా వర్షపునీరు వస్తోంది. కలసపాడు మండల పరిధిలోని దిగువ తంబళ్లపల్లె వద్ద ఉన్న ఆనకట్ట ద్వారా కలసపాడు చెరువుకు నీరు చేరి నిండు కుండలా ఉంది. భారీ వర్షానికి మండలంలోని పలు చెరువులకు ఓ మోస్తరు వర్షపునీరు చేరింది. మండలంలో అక్కడక్కడ వరి మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



సగిలేరు ఆనకట్టపై వరదనీళ్లు

గండికోటకు 1565 క్యూసెక్కులు..



గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెన్నా, చిత్రావతి నదులతో పాటు స్థానికంగా కురిసిన వర్షాల వల్ల వాగులు, వంకల ద్వారా శుక్రవారం గండికోట ప్రాజెక్టులోకి 1565 క్యూసెక్కుల వరదనీరు చేరినట్లు ఈఈ ఉమా మాహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా అవుకు రిజర్వాయిర్ నుంచి 500 క్యూసెక్కుల కృష్ణాజాలలు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 26.207 టీఎంసీల నీటిమట్టం ఉంది.

తక్షణం మెడిసిన్ అందుబాటులో ఉంచాలి

- విద్యార్థుల డిమాండ్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఆరోగ్య కేంద్రంలో మెడిసిన్ లేకపోవడం సిగ్గుచేటని, తక్షణం మెడిసిన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం వైవీయూ ప్రధాన ద్వారం వద్ద టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైవీయూ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు భరత్‌సింహ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రంలో గత కొన్ని నెలలుగా మందులు అందుబాటులో లేవని, విద్యార్థులు కడప నగరానికి వెళ్లి సొంత ఖర్చులతో వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాలు, మెస్ పరిసరాల్లో అపరిశుభ్రత, స్నానాల గదుల్లో కొళాయిలు, తలుపులు లేని పరిస్థితి కారణంగా వ్యాధులు వ్యాపిస్తున్నాయని తెలిపారు. గ్రంథాలయం, ఆర్ట్స్ అండ్ కామర్స్ భవనం, వసతి గృహాలపై వైఫై సదుపాయం కల్పించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కాగా, విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో పెండ్లిమర్రి సీఐ దొర మధ్యవర్తిత్వం చేసి రిజిస్ట్రార్‌తో జరిపిన చర్చలు విఫలమయ్యాయని, త్వరలో అన్ని విద్యార్థి సంఘాలతో ఉమ్మడి కార్యాచరణ చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో కిషోర్, గంగన్న, సాయికృష్ణ, ఉమర్‌బాష, బెంజమిన్, రాకేష్, నవీన్, ప్రభు, గణేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వైవీయూ అధికారులు, పోలీసులు

రోడ్డు భద్రతపై ఎస్పీ స్పెషల్ డ్రైవ్



వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ నచికేత్

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాద్ శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కడప నగరంలోని పలు కూడళ్లల్లో ఎస్పీ స్వయంగా వాహనాలను తనిఖీ చేశారు. సెవెన్‌రోడ్స్, క్రిష్ణ, అప్సర, అంబేద్కర్, ఐటీఐ, ఊటుకూరు తదితర సర్కిళ్లలో జరుగుతన్న స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మైనరు డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, రికార్డులు లేనివాహనాలు, కంపెనీ ఫిట్టెడ్ సైలెన్సర్‌లను కాకుండా ఇతర సైలెన్సర్‌లను వాడడం, అనధికారికంగా సైరన్‌లను వాడేవారిపై, వివిధ శాఖల పేరుతో నకిలీ నెంబరు ప్లేట్‌లు కలిగి ఉన్న వారిపై, డ్రంకెన్ డ్రైవ్, ఓవరు లోడింగ్, అతివేగంతో నడిపే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ఎస్పీ తెలిపారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట పోలీసు అధికారులు ఉన్నారు.

నేను కష్టపడతా..మీరు కష్టపడండి

- వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నేను కష్టపడతాను.. మీరు కష్టపడి పనిచేయాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వ విద్యాలయం పాలనలో పారదర్శకత, వేగం ఉండాలని, ఫైల్ క్లియరెన్స్ లో ఆలస్యం చేయరాదని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పేపర్‌లెస్ ఆఫీస్ విధానాన్ని పూర్తిగా అమలు చేయాలని ఆదేశించారు. తర్వాత ఆర్ట్స్ బ్లాక్‌ను పరిశీలించిన ఆయన విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కంప్యూటర్ ల్యాబ్ సందర్శించి విద్యార్థులతో సాంకేతిక అంశాలపై మాట్లాడారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార భద్రత పథకాన్ని అమలు చేయాలి

- వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్

కడప రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండల స్థాయిలలో జాతీయ ఆహార భద్రత, పోషణమిషన్ పథకాన్ని అమలు చేసి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా వ్యవసాయశాఖ సమావేశ హాలులో జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులకు జాతీయ ఆహార భద్రత మరియు పోషణ మిషన్‌పై శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత పోషణ మిషన్ పథకం ప్రయోజనాలను నెరవేర్చాలన్నారు. అనంతరం పథకాన్ని మండల, గ్రామ స్థాయిలో అమలు చేసే విధివిధానాలపై తెలియజేశారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పులివెందుల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా అరుణాచలం క్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం పులివెందుల డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. అక్టోబరు 26, నవంబరు 2, 9, 16వ తేదీలలో పులివెందుల నుంచి ఉదయం 7గంటలకు అరుణాచలానికి బస్సు బయలుదేరుతుందన్నారు. నవంబరు 4వ తేదీ కార్తీక పౌర్ణమి రోజు ఉదయం 7గంటలకు పులివెందుల డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు వివరించారు. సూపర్ లగ్జరీ బస్సుకు రానుపోను చార్జీ రూ.1200గా నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో పాటు కార్తీకమాసంలో ప్రతి సోమవారం అక్టోబరు 26వ తేదీ, నవంబరులో 2, 9, 16వ తేదీలలో ఉదయం 6.30 గంటలకు శ్రీశైలానికి స్పెషల్ సర్వీస్ అల్ట్రా డీలక్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు రాను పోను చార్జీ రూ.1280 అన్నారు.

నేడు పొలతల ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

పెండ్లిమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం శనివారం ఉదయం జరగనుందని ఆలయ ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఓ మాట్లాడుతూ చైర్మన్‌గా శిరిగిరెడ్డి రాజారెడ్డి, పాలక మండలి సభ్యులుగా 11 మంది ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిలు హాజరు కానున్నారని తెలిపారు. అనంతరం కార్తీకమాస ఉత్సవాల ఏర్పాట్లపై మండల స్థాయి అధికారులతో ఈవో చర్చించారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

సీకేదిన్నె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు శాస్త్రవేత్తలు మెరుగైన సేవలు అందించాలని ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ తెలిపారు. మండలంలోని కొలుములపల్లె, ఇప్పెంట గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రైతుల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకుని పంట ఖర్చును తగ్గించి ఆదాయ మార్గాలు పెంచాలన్నారు. ఈ ప్రాంతానికి అనుకూలమైన పంటల సరళితో మార్పు చేసి రైతుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కొలుములపల్లెలో వ్యవసాయం వైపు యువతను ఆకర్షించడం, నిలుపుకోవడం (ఆర్య పథకం)కింద సరఫరా చేసిన వర్మీకంపోస్టు యూనిట్లను, తమలపాకు తోటలను పరిశీలించారు. దేశవాలీ కోళ్ల పెంపకం ద్వారా రైతులు వ్యవసాయంతోపాటు అదనపు ఆదాయం పొందేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా తిరుపతి, మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో తెలుసుకున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతితో కలిసి కేవీకే ఆధ్వర్యంలో ఉన్న పుట్టగొడుగులు, వర్మీకంపోస్టు, కోళ్లపెంపకం కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త క్రిష్ణప్రియ, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేశ్‌బాబు, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొలుములపల్లెలో రైతులతో మాట్లాడుతున్న శివనారాయణ

యువజనోత్సవాలలో యువత విరివిగా పాల్గొనాలి

కడప నాగరాజుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యువజనోత్సవాలలో యువత విరివిగా పాల్గొనాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం కడపలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజనోత్సవాలు-2025లో భాగంగా విద్యార్థులకు ఫోక్ డ్యాన్స్, ఫోక్ సాంగ్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ యువత చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కాగా, యువజనోత్సవాలలో జిల్లా నలుమూలల నుంచి వివిధ పోటీలలో పాల్గొనేందుకు దాదాపు 485 మంది పేర్లను నమోదు చేసుకున్నారు. శుక్రవారం నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సెట్ప్ సీఈఓ జోయల్ విజయ కుమార్, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్‌కుమార్, స్పిరిట్స్ కళాశాల డైరెక్టర్ రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.



యువజనోత్సవాల సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

వర్షానికి కూలిన మిద్దె కప్పు.. మూడు గేదెలు మృతి



చాపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామంలో గురువారం రాత్రి మిద్దె పైకప్పు కూలడంతో మూడు గేదెలు మృతి చెందాయి. గ్రామంలోని మార్తల ఓబుళరెడ్డి 30 ఏళ్ల క్రితం ఈ మిద్దెను నిర్మించారు. ప్రస్తుతం దీనిని పశువులపాకగా ఉపయోగిస్తున్నారు. రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురువడంతో మిద్దె పైకప్పు కూలి గేదెలు మృతి చెందాయి. గేదెల విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటాయని బాధితుడు తెలిపారు. చాపాడు పశువైద్య అధికారి మహమ్మద్‌గౌస్, వీఆర్వో రాజశేఖర్‌రెడ్డి మృతిచెందిన గేదెలను పరిశీలించారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు నివేదిక పంపుతున్నట్లు వీఆర్వో తెలిపారు.

పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ఏఆర్, సివిల్ విభాగంలోని కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐ స్థాయి వరకు సిబ్బంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ' నేటి కాలంలో పోలీసుల విధి నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు పర్యవేక్షించారు.

కార్యక్రమంలో ఆర్‌ఐ శివరాముడు, ఆర్ఎస్‌ఐలు స్వామినాయక్, వెంకటేశ్వర్లు, అప్పలనాయుడు, శ్రీనాథ్, చూడామణివర్మ, ఏఆర్ ఎస్‌ఐ కొండారెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు..: అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ పరిధిల్లోని పలు విద్యాసంస్థల్లో, పాఠశాలల్లో 'లైంగిక నేరాల నుంచి మహిళలు,పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మంచి ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించనున్నారు.

పారదర్శకంగా క్రీడా ఎంపికలు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప డివిజన్ స్థాయి క్రీడా ఎంపికలను అత్యంత పారదర్శకంగా నిర్వహి స్తున్నట్లు జిల్లా స్కూలు గేమ్స్ కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో కడప డివిజన్ స్థాయి క్రీడా పోటీల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు కడప డివిజను పరిధిలోని 9 మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో కబడ్డీ, చెస్. యోగా, బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడా ఎంపికలు జరిగాయి.

పాపిరెడ్డిపల్లెలో పిడుగుపాటు

కాశినాయన అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపిరెడ్డిపల్లెలో గురువారం రాత్రి లక్ష్మీనరసయ్య అనే రైతు ఇంటి సమీపంలో పిడుగు పడింది. దీని ప్రభావంతో ఇంటి మెట్లభాగం నెర్రెలు బారింది. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. పిడుగుపాటుకు లక్ష్మీనరసయ్య ఇంటితో పాటు సమీప గృహాల్లోని విద్యుత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు చాలా వరకు కాలిపోయాయి. వీధిలైట్లు కూడా కాలిపోయాయి.

నూతన బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్‌కు బోర్డు ఆమోదం హర్షణీయం

వేంపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ నూతన బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి రూ.2056కోట్ల అంచనాతో 110కిలోమీటర్ల మేర రైల్వే బోర్డు ఆమోదం తెలపడంపట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో కడప-రాయచోటి- మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే మార్గం మాటేమిటని ప్రశ్నించారు. శుక్రవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత రైతుల, వినియోగదారుల అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008-09 రైల్వే బడ్జెట్‌లో నాటి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కడప-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ మార్గాన్ని మంజూరు చేసిందన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

గుర్రంకొండ, కలికిరిలో సబ్ స్టేషన్లకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు : ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి



గుర్రంకొండలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించిన ఈఈ చంద్రశేఖర్ రెడ్డి

గుర్రంకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతన్నలకు లో ఓల్టేజీ సమస్య రాకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందజేస్తామని పీలేరు ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గుర్రంకొండ విద్యుత్ సబ్ స్టేషన్ లోఓల్టేజీ సమస్యను తీర్చడానికి ఐదు ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో రైతన్నలు అధికంగా మోటర్లను వినియోగిస్తుండడంతో లో ఓల్టేజీ సమస్య తలెత్తేదన్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీంతో రైతులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. అలాగే లో ఓల్టేజీ సమస్య ఉన్న సబ్ స్టేషన్‌లో కూడా అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చుతామన్నారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ విజయభాస్కర్, డీఈ శ్రీనివాసులు, శివయ్య, ఏఈ ఆదినారాయణ, రఫీ, సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన ఓల్టేజీతో విద్యుత్ సరఫరా...

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్లలో మెరుగైన ఓల్టేజీతో విద్యుత్ సరఫరా కోసం శుక్రవారం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. కలికిరి పంచాయతీ తుమ్మలపేట, గుట్టపాలెం పంచాయతీ బరిణేపల్లె సబ్ స్టేషన్లలో ప్రస్తుతం ఐదు ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లకు తోడు మరో ఐదు ఎంవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చి ప్రారంభించినట్లు పీలేరు ట్రాన్స్‌కో డివిజన్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆయన రైతులతో మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం అనేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వినియోగదారులు సోలార్ పలకలను అమర్చుకుంటే ఇళ్లకు నాణ్యమైన గ్రీన్ ఎనర్జీని ఖర్చులేకుండా పొందవచ్చన్నారు. ప్రభుత్వం రుణ సదుపాయం, సబ్సిడీ అందజేస్తున్నట్లు చెప్పారు. రాయచోటి ట్రాన్స్‌ఫార్మర్స్ నిర్వహణ ఈఈ విజయభాస్కర్ రెడ్డి, ప్రొటెక్షన్ ఏఈ విజయభాస్కర్ రెడ్డి, కలికిరి డీఈఈ శివయ్య, ఏఈ ముజిబుర్ రహ్మాన్, కలికిరి జేఈ గోవర్ధన్, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకే పీపీపీ విధానం అమలు : బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ నేత చల్లపల్లె నరసింహారెడ్డి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పేదలకు, మధ్య తరగతివారికి మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ వైద్య కళాశాల్లో పీపీపీ విధానం అమలు చేస్తున్నట్లు బీజేపీ జాతీయ నేత చల్లపల్లె నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్ర వారం తన స్వగృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందివ్వడానికి ప్రభుత్వాలు ప్రభుత్వ వైద్య కళాశాల్లో పీపీపీ విధానం తెస్తుంటే ప్రతిపక్ష పార్టీలు వైసీపీ, బీఎస్పీ, సీపీఐ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానంలో 30శాతం రోగులు, 70 శాతం ప్రభుత్వం ఖర్చు భరిస్తోందని, తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం పేదలకు అందుతోందన్నారు. వైద్య విద్యను రుఘీటజూ విద్యార్థులు నష్టపోరన్నారని, దీనిపైన రోగులు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ నిర్మించిన వైద్య కళాశాలలు నాణ్యత లోపించాయని, అవి సరిచేసి వైద్య కళాశాలలను నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, జిల్లా నేతలు ఆకుల కృష్ణమూర్తి, జేకే వర్మ, పూల నాగరాజు, పిల్లస్వామినాయక్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్



మంత్రి నాదెండ్లకు స్వాగతం పలుకుతున్న రామ్‌దాస్ చౌదరి, జంగాల శివరాం

మదనపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జనసేన నేతలు గంగారపు రామ్‌దాస్ చౌదరి, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిశారు. మూడురోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి విచ్చేసిన మంత్రికి వీరిద్దరూ రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడే మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.శివరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గ్రానైట్ బాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు నాయిని జగదీష్ తదితరులు ఉన్నారు.

మంత్రి మనోహర్‌ను కలిసిన జనసేన నేతలు

పీలేరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పీలేరు నియోజకవర్గ జనసేన నేతలు పద్మావతి గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం పీలేరు జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి, పీలేరు ఏఎంసీ డైరెక్టర్ కలప రవి ఆధ్వర్యంలో పలువురు కలిసి సన్మానించారు. నియోజక వర్గంలో పార్టీ బలోపేతం, జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఎన్ఆర్ఐ రామచంద్రనాయక్, మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్, పీలేరు మండల ప్రధాన కార్యదర్శి షఫీ, మున్నార్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



రైల్వే స్టేషన్ వద్ద ఎక్స్‌కవేటర్‌తో మురికినీటిని తొలగిస్తున్న అధికారులు

వాల్మీకిపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో అధికారులు పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. లోపించిన పారిశుధ్యంపై శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో 'మురుగు కదిలే... దారేది' అన్న కథనం ప్రచురితమవడంతో స్పందించిన అధికారులు రైల్వే స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కగా ఉన్న మురికినీటి గుంత, కల్వర్టు ప్రాంతాల్లో ఎక్స్‌కవేటర్ చర్యలు చేపట్టారు. జెట్టిపాళెం, బజారువీధి, ఎల్ఆర్‌వీధి, కొత్తపేట వీధి, బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో డ్రైనేజీల చెంత పారిశుధ్య పనులు చేపట్టారు. పింగాణి ఫ్యాక్టరీ వద్ద అక్రమంగా మూసివేసిన కల్వర్టు ప్రాంతం వద్ద సమస్యను పరిష్కరించారు. ప్రజలు కూడా మురికినీటి కాల్వల్లో చెత్త వేయరాదని పంచాయతీ సిబ్బంది వీధుల వెంట వచ్చే చెత్త సేకరణ వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలియజేశారు.

బాలికల చదువు దేశానికి వెలుగు



బాలికలకు బహుమతులు అందజేస్తున్న సూపర్‌వైజర్లు

తంబళ్లపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బాలబాలికల చదువు దేశానికి వెలుగు అని సీడీపీఓ సుజాత అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో తంబళ్లపల్లె హైస్కూలు, మోడల్ స్కూలు, కేజీబీవీల్లో నిర్వహించారు. బాలికల చదువు, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, జెండర్ ఈక్విటేషన్ గురించి పిల్లలకు వివరించారు. పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం నిర్వహించిన పోటీలో విజేతలకు బహుమతులు అందచేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రకాంత, రమణమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట నుంచి కువైత్‌కు విమాన సౌకర్యం కల్పించండి

తంబళ్లపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయం నుంచి కువైత్‌కు విమాన సౌకర్యం కల్పించాలని ఎన్ఆర్ఐ టీడీపీ పాలఏకరి సంఘం కువైట్ అధ్యక్షుడు కొండామర్రి శ్రీహరి నాయుడు కోరారు. కువైత్ పర్యటనలో ఉన్న తుడా చైర్మన్, టీటీడీ ఎక్స్ అఫీషియో మెంబర్ డాలర్స్ దివాకర్‌రెడ్డిని కువైట్‌లోని సాల్మియాలో కలిశారు. ఉమ్మడి చిత్తూరు, కడప, అనంతపురం జిల్లా వాసులు గల్ఫ్ దేశాలకు వెళ్లాలంటే బెంగళూరు, చెన్నై విమానాశ్రయాలకు వెళ్లాల్సి వస్తోందని రేణిగుంట విమానాశ్రయం నుంచి కువైత్‌కు విమాన సౌకర్యం కల్పిస్తే అనుకూలంగా ఉంటుందని వివరించారు.

26న రౌండ్ టేబుల్ సమావేశం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 26న నిర్వహించే గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జీపీఎస్ జాతీయ అధ్యక్షుడు మాజీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ పిలుపు నిచ్చారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో గిరిజన ప్రజా చైతన్య యాత్ర పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. గిరిజన హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ గిరిజనులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులు లేక మైదాన ప్రాంతాల్లో దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. గిరిజనులకు రాజకీయంగా రిజర్వేషన్ కల్పించాలన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాల ఏర్పాటు

పీలేరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అపార్ ఐడీ కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మదనపల్లె డీవైఈఓ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పీలేరు ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆధార్ కార్డులో మార్పులు చేర్పుల కోసం ప్రత్యేక కేంద్రాలు 30వ తేదీ వరకూ కొనసాగుతాయన్నారు. పీలేరు గవర్నమెంట్ హైస్కూల్, వీఎస్ఎన్ సిద్ధార్థ, బోడుమల్లువారిపల్లె ప్రాథమిక పాఠశాలల్లో 25వ తేదీ వరకూ, 27, 28వ తేదీల్లో కావలిపల్లె ప్రాథమిక, పీలేరు మెయిన్ హైస్కూల్, కోటపల్లె జడ్పీ బాలుర హైస్కూల్, 29, 30 తేదీల్లో కోటపల్లె ప్రాథమిక, భువన విద్యాలయం, గూడరేవుపల్లె ప్రాథమిక పాఠశాలలో ఆధార్ కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జడ్పీ బాలికల పాఠశాలలో 23 నుంచి ప్రారంభమైన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీఓ షకూర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడకుండా ఆధార్ నమోదు చేయాలన్నారు. ఇదే పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం రుచి చూసి నాణ్యత పాటించాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర

రామసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం డీఎస్పీ ఎస్.మహేంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎస్పీ రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా రౌడీయిజం, అక్రమ మద్యం, గంజాయి ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కర్ణాటక సరిహద్దులోని చెక్ పోస్టు వద్ద ప్రత్యేక పోలీసులను పెట్టామని డీఎస్పీ, సీఐ తెలిపారు. సీఐ సత్యనారాయణ, ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బాహుదా పరీవాహక ప్రాంతీయులకు హెచ్చరిక

నిమ్మనపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మూడు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలను బాహుదా ప్రాజక్టు నిండే అవకాశం వుందని నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఇరిగేషన్ డీఈ దయానంద్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం బాహుదా ప్రాజక్టును పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిండేందుకు కేవలం మూడు అడుగులు మాత్రమే వుందని ప్రజలు నదీ పరివాహక ప్రాంతాల్లో వుండరాదని, గొర్రెలు, ఆవులు మేపే వారు, వాహనదారులు కాల్వ వైపు వెళ్లరాదని హెచ్చరించారు. వాహనదారులు రాత్రిళ్లు బాహుదా వంతెనను దాటరాదన్నారు. ప్రజలు ప్రాజెక్టు వంతెనపై వెళ్లరాదని సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాహుదా సాగునీటి సంఘం అధ్యక్షుడు దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

పీలేరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం సహాయ కార్యదర్శి నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. 28వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం పీలేరులో పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని ఆరోపించారు. సమావేశంలో నేతలు నాగరాజు, రమణమ్మ, ముబారక్, కళావతి, సిద్దమ్మ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీడీ

కలకడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని కేజీబీవీ రాష్ట్ర డీడీ దేవరాజులు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం కలకడ కేజీబీవీని సందర్శించిన ఆయన మాట్లాడుతూ పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా వారితో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి ప్రణాళిక బద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని టెన్త్ విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో జీసీడీఓ సుమతి, ఏపీఓ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

పెద్దమండ్యంకు రాని ఆర్టీసీ బస్సు

పెద్దమండ్యం అకోటబరు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె- గాలివీడు మార్గంలో నడుస్తున్న ఆర్టీసీ బస్సులు శుక్రవారం రాలేదు. దీంతో మదనపల్లె నుంచి పెద్దమండ్యం గాలివీడుకు ప్రయాణీకుల సేవలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా తుఫాన్ కారణంగా పెద్దమండ్యం కుషావతి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తారు రోడ్డు ధ్వంసమైంది. దీంతో రోడ్డుపై అక్కడక్కడా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. శుక్రవారం ఉదయం నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజల కష్టాలు అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని అనేక విమర్శలు వస్తున్నాయి.

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు



మదనపల్లె అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో గంగమ్మకు శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేసి, దూపదీప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాహుకాలంలో మహిళలు అమ్మవారికి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు కరుణాకర్ నాయుడు, కార్యదర్శి మార్పురి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్ మార్పూరి మహేష్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

భారీ వర్షాలకు కూలిన పాఠశాలల ప్రహరీలు



కూలిన రెడ్డివారిపల్లి పాఠశాల ప్రహరీ

నిమ్మనపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ నేలకూలాయి. శుక్రవారం రెడ్డివారిపల్లి పంచాయతీ జడ్పీ హైస్కూల్‌లో వున్న ప్రహరీ, వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయునివారిపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ప్రహరీ నెలకొరిగింది. అయితే పాఠశాలకు సెలవు వున్నందున విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీనిపై ఎంఈఓ-2 నారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్మించిన గోడలు పాతవి కావడంతో భారీ వర్షాలకు కూలినట్లు తెలిపారు. వీటి స్థానంలో కొత్తగా ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

హెల్మెట్‌ను ధరించాలి

గుర్రంకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని ఎస్ఐ రఘురాం సూచించారు. ద్విచక్ర వాహనదారులకు శుక్రవారం ఆయన హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్‌ను వినియోగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న టిప్పర్



టిప్పర్ ఢీకొని విరిగిన స్తంభం

తంబళ్లపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె-తంబళ్లపల్లె ప్రధాన రోడ్డుపై ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో గురువారం ఉదయం ఓ ఇసుక టిప్పర్ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. ఈ స్తంభంపై 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం సగానికి విరిగిపోగా విద్యుత్ లైన్ల సహాయంతో కింద పడకుండా నిలబడింది. ఈ విషయాన్ని వెంటనే స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే కరెంటు సరఫరా నిలిపివేశారు. విద్యుత్ స్తంభం కనుక కింద పడి ఉంటే పెద్దగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించేది. విద్యుత్ శాఖ ఏఈ సురేంద్ర, ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. లైన్‌మెన్లు శంకర, అప్పిరెడ్డి, సిబ్బంది యుద్ధప్రాదికన నూతన కరెంటు స్తంభం ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



బి.కొత్తకోట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం టీడీపీ నేతలు బాధితులకు అందించారు. సుబ్రమణ్యం బి.కొత్తకోట, హరి నాయనబావి, పి. అబ్బాస్ బడికాయలపల్లె, ఉలవలవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు తదితరులకు రూ. 7.16 లక్షల విలువైన చెక్కులను అందచేశారు. మండల తెలుగు రైతు అధ్యక్షుడు నాయనబావి సిద్దారెడ్డి, చావిడి కిట్టన్న, ఎండీ. మస్తాన్, ప్రభాకర్, మరవపల్లె మస్తాన్‌రెడ్డి, మదార్‌సాబ్, రంగనాథ్ పాల్గొన్నారు.